RNI Reg-No. APTEL/2002/07373

# నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

Postal Registration No.VJ/215/2025-27

సంపుటి :24 Vol. No.24 సంచిక : 70 Issue No. 70 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: సోమవారం 09-03-2026 Monday, March 09 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## రాజమహేంద్రవరం ట్రాన్స్‌కో స్టోర్స్‌లో అగ్నిప్రమాదం



**రాజమహేంద్రవరం, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరం బొమ్మూరు మిగతా 2లో..

## బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, మార్చి 8 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. టీఎంసీ పై మండిపడ్డారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వెళ్తే సత్కరించడానికి బదులు..ఆమె పాల్గొనే కార్యక్రమానికి అక్కడి ప్రభుత్వం అనుమతివ్వ లేదన్నారు. ఇటువంటి చర్యలతో మమత ప్రభుత్వం రాష్ట్రపతిని మాత్రమే కాకుండా భారత రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని అన్నారు. ద్రౌపదీ ముర్ము ఎంతో కష్టపడి దేశంలోని అత్యున్నత స్థానానికి ఎదిగారని మోదీ పేర్కొన్నారు. మురికి రాజకీయాలు చేసే తృణమూల్‌కు బెంగాల్ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగనున్న బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించేది భాజపానేనని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మిగతా 2లో..





## డ్వాక్రా, మెప్మాతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు

### స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చుతాం: రాజధాని అమరావతిలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు

**అమరావతి, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చిన నేత ఎన్టీఆర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలు బాగా చదువుకోవాలని ప్రత్యేక విశ్వవిద్యాలయం తెచ్చారని చెప్పారు. రాజధాని అమరావతిలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ఇప్పుడు అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ సంపాదిస్తున్నారు. డ్వాక్రా, మెప్మా వల్ల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. మహిళా మిగతా 2లో..

## చంద్రబాబు సమక్షంలో మెప్మా, సెర్ప్ కీలక ఒప్పందాలు



**అమరావతి, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీఎం చంద్రబాబు సమక్షంలో వేర్వేరు సంస్థలతో పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సముద్రపు నాచుతో ఉత్పత్తుల తయారీకి 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం కుదిరింది.

మరిన్ని ఒప్పందాలు

- సీవీడ్ కల్చర్‌లో మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల తయారీ కోసం సీఎస్ఐఆర్‌తో ఒప్పందం
- వివిధ రకాల ఉత్పత్తుల తయారీ కోసం కేరళకు చెందిన అమృత వర్సిటీ పీఠంతో ఒప్పందం
- మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పనపై ఎక్స్ఎల్ఆర్ఐ సంస్థతో ఒప్పందం
- పొదుపు చేసిన మొత్తాలతో వ్యాపారాలు చేసేందుకు ఐఎస్‌బీతో సెర్ప్ ఒప్పందం
- చేనేత, ఇతర ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఆప్కోతో ఒప్పందం
- డిజిటల్ కామర్స్, ఎఫ్‌పీవో ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సాయం కోసం ఐఐఎం విశాఖతో ఒప్పందం.

## మహిళలు దృఢంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది

మంత్రి నారాయణ



**నెల్లూరు, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. మహిళలకు గౌరవం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మహిళలు దృఢంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలంగా ఉంటుందని చెప్పారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరించిన మంత్రి, స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం రూ.1370 కోట్ల రుణాల చెక్కులు పంపిణీ చేశారు.

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం

స్పందించిన చంద్రబాబు, పవన్



**అమరావతి, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రొటోకాల్ కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన పర్యటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని.. రాష్ట్రపతి పదవిని అవమానించేలా బెంగాల్ ప్రభుత్వం వ్యహరించడం బాధ కలిగించిందన్నారు. రాష్ట్రపతి పర్యటనలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఎక్స్‌లో పోస్టు మిగతా 2లో..

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్

వివరణ ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 8 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం మిగతా 2లో..

## జేడీ(యూ)లో చేరిన నీతీశ్ కుమారుడు నిశాంత్



**పట్నా, మార్చి 8 (ఆర్ఎన్ఎ):** బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ నేడు అధికారికంగా జేడీ(యూ)లో చేరారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి లలన్ సింగ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ చౌదరి, సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో నిశాంత్ పార్టీలో చేరారు. ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్.. నీతీశ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన కొన్ని రోజుల తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు. అయితే ఈ కార్యక్రమానికి నీతీశ్ కుమార్ హాజరు కాకపోవడం గమనార్హం. పార్టీలో చేరిన అనంతరం నిశాంత్ మాట్లాడుతూ..పార్టీ సభ్యుడిగా జేడీయూ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బిహార్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే పార్టీ లక్ష్యమన్నారు. తన తండ్రి నీతీశ్ రాజ్యసభకు వెళ్లడం ఆయన తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని..దానిని స్వాగతిస్తున్నానని తెలిపారు.నీతీశ్ ఎగువసభకు వెళ్తుండడంతో బిహార్ ముఖ్యమంత్రి స్థానం భాజపాకు దక్కే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నిశాంత్ కుమార్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## గల్ఫ్‌లో ఉద్రిక్తతలు.. స్వదేశానికి 52 వేల మంది భారతీయులు



**న్యూఢిల్లీ, మార్చి 8 (ఆర్ఎన్ఎ):** అమెరికా, ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్ దేశాలపైనా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. దీంతో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న, యుద్ధ పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన భారత పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఈ నెల మొదటి వారంలో గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. పశ్చిమాసియాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. "గల్ఫ్ రీజియన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి విమానాల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించడంతో ఈ నెల 1 నుంచి 7 మధ్యలో 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో సుమారు 32 వేల మంది భారత విమానాల్లో ప్రయాణించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. విమాన కార్యకలాపాలు ఇంకా అందుబాటులోకి రాని దేశాల్లో ఉన్న భారత పౌరులు.. స్థానిక రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌ను సంప్రదించాలి" అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. విదేశాల్లోని భారత పౌరుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, సాయం అవసరమైన వారందరికీ అండగా నిలిచేందుకు స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.

**ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం: నెతన్యాహు**

పశ్చిమాసియాలో ఉన్న భారత పౌరులు.. స్థానిక అధికారుల మార్గదర్శకాలను, అక్కడి భారత దౌత్య కార్యాలయాలు జారీ చేసే సలహాలను పాటించాలని విదేశాంగ శాఖ సూచించింది. ఇప్పటికే అవసరమైన అడ్వైజరీలను స్థానిక భారత ఎంబసీ, కాన్సులేట్ జారీ చేశాయని తెలిపింది. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపింది. అదే విధంగా విదేశాంగ శాఖ కార్యాలయంలో ఓ ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తెలుగు రాష్ట్రాల సీఎంల శుభాకాంక్షలు



**హైదరాబాద్, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మహిళామణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగింటి ఆడపడుచులకు, తల్లులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు చెప్పారు. ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు ఇవ్వడం నుంచి ప్రారంభమైన మహిళా సాధికారిత మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

కుట్రపూరితంగానే తప్పుడు ఆరోపణలు చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం భాజపా దేశంలోని అత్యున్నత పదవిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి స్థానానికి గౌరవం ఇస్తామన్నారు. ఆ కార్యక్రమంలో ద్రౌపదీ ముర్ము పాల్గొంటారనే విషయంపై ఎటువంటి ముందస్తు సమాచారం లేదన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రస్థానం.. నేడు మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేసే విధంగా కొనసాగుతోందని చెప్పారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తోందని వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా 7955 మంది మహిళలకు టీచర్ ఉద్యోగాలు, 993 మహిళలకు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమైనవని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమాజాభివృద్ధికి మహిళా సాధికారత ప్రమాణమని.. ఆడబిడ్డల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం దినోత్సవం సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మనిచ్చిన అమ్మ .. జీవితాంతమూ మనల్ని కంటికి రెప్పలా కాచే మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. తాత తెలుగింటి ఆడపడుచులకు అన్న అయ్యి ఆస్తి హక్కు ఇచ్చారని.. తన తండ్రి మహిళా సాధికారతకు స్వయంశక్తి సంఘాలను ఆరంభించారని గుర్తు చేశారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్

కొనసాగుతోంది. ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తికి కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ లేఖ రాశారు. అందులో కేంద్రం కొన్ని అంశాలను ప్రస్తావించింది.

గీ రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎందుకు హాజరు కాలేదు?

- రాష్ట్రపతి కోసం ఏర్పాటు చేసిన వాష్ రూమ్‌లో నీళ్లు లేవు.
- రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్లే దారి చెత్తతో నిండిపోయింది.

డార్జిలింగ్ జిల్లా మేజిస్ట్రేట్, సిలిగుడి పోలీస్ కమిషనర్, అదనపు - జిల్లా మేజిస్ట్రేట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయండి. దీనికి సంబంధించి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర ప్రభుత్వం సమయం ఇచ్చింది.

**బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం**

అంతర్జాతీయ సంతాల్ సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్రపతి ముర్ము శనివారం పశ్చిమ బెంగాల్ వెళ్లారు. అయితే ఆ సదస్సుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో.. చివరి నిమిషంలో మరోచోటికి మార్చారు. దీంతో కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే అక్కడికి వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతిని స్వాగతించేందుకు సీఎం, మంత్రులు రావాల్సి ఉండగా రాలేదు. దీనిపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అన్ని హద్దులు దాటిందంటూ ప్రధాని నరేంద్ర మోదీ (గ్రావీ వీశీఎఱ) ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## రాజమహేంద్రవరం ట్రాన్స్ కో స్టోర్స్‌లో అగ్నిప్రమాదం

ట్రాన్స్‌కో స్టోర్స్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటికే వినియోగించి తీసుకొచ్చిన స్క్రాప్ మీటర్లు ఉంచిన చోట ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలికి చేరుకున్న 6 అగ్నిమాపక శకటాలు మంటలను అదుపు చేస్తున్నాయి. రాజమహేంద్రవరం ట్రాన్స్‌కో ఎస్‌ఈ తిలక్ ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తానికి ఇక్కడి నుంచే విద్యుత్ సరఫరా అవుతుంది.

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం

పెట్టారు. "ఏ ప్రభుత్తమైనా రాష్ట్రపతి పట్ల అత్యంత గౌరవ, మర్యాదలతో మెలగాలి. రాజ్యాంగ సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయి. వాటి పవిత్రతను కాపాడుకోవడం సమష్టి విధి" అంటూ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఇది అత్యంత విచారకరమైన ఘటన అని పేర్కొన్నారు. "మన దేశంలో రాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యంగ హోదా కలిగి ఉంది. ఆ పదవికి ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవాన్ని ఇవ్వాలి. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేలా చూడటం సంబంధిత యంత్రాంగం బాధ్యత" అని పేర్కొన్నారు.

## డ్వాక్రా, మెప్మాతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు ఇప్పటికే లక్ష దాటారు. తీసుకున్న రుణాలను సమయానికి బ్యాంకులకు చెల్లిస్తున్నారు. తెలుగు మహిళలు ఏ పని తలపెట్టినా.. సాధించే వరకు వదలరు. అప్పులు ఇప్పించే బాధ్యత నాది.. సద్వినియోగం చేసుకునే పని మీది. స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే బాధ్యత నాది. మీరు చేసిన ప్రతి వస్తువుకు మంచి ధర వచ్చేలా చూస్తాం. ప్రతి ఇంట్లో స్వయం బ్రాండ్ ఉత్పత్తులే వాడాలి. ఈ ఏడాది మరో 5 లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. డ్వాక్రా, మెప్మాలో 1.1 కోట్ల మంది సభ్యులున్నారు. మీరు తయారు చేసే ఉత్పత్తులు దేశవ్యాప్తంగా విస్తరించాలి. మా ఇంట్లో కూడా ఇద్దరు మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేశాం. నా భార్య, కోడలు సమర్థంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ మహిళా వ్యాపారవేత్త ఉండాలి. ఆడబిడ్డల రక్షణ విషయంలో మాత్రం రాజీ లేదు. దుర్మార్గులను అరికట్టాల్సిన బాధ్యత కూడా మీదే. మహిళల జోలికి వస్తే అదే వారికి చివరిరోజు అవుతుంది. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో ఎవరికీ వ్యాధులు రాకుండా చూసుకునే బాధ్యత మీదే. సమాజంలో వచ్చిన మార్పుల వల్ల జనాభా తగ్గిపోతోంది. జనాభా తగ్గితే అనేక ప్రమాదాలు వస్తాయి. పెద్ద కుటుంబంతో మనకు రక్షణ, భద్రత, ఆనందం. ప్రభుత్వ పథకాలన్నీ పెద్ద కుటుంబాలకే అందేలా చూస్తాం. ఇప్పుడు 58శాతం మంది ఒక్క బిడ్డకే పరిమితం అవుతున్నారు.

రాష్ట్ర ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలి. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో సుపరిపాలన ఉండాలి. మనకు డబ్బు సమస్య కాదు.. ఆలోచనా విధానమే ముఖ్యం. మీ పరిధిలో ఉన్న విషయాల్లో తప్పు చేయకుండా ముందుకెళ్లాలి. ఇంటా, బయటా చిన్న చిన్న సమస్యలు వచ్చాయని వెనక్కి తగ్గవద్దు. ఇప్పుడు ప్రతి పథకం మహిళల పేరుతోనే ఇస్తున్నాం. ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా ఉండాలి. తగాదాలు రాకుండా చూడాలి. ఇప్పుడు ఇళ్లలో ఎవరూ మాట్లాడుకోవడం లేదు. అందుకే సమస్యలు. ఫోన్ ఎక్కువగా చూసినా మానసిక సమస్యలు వస్తాయి. స్మార్ట్ ఫోన్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఫోన్ ఎక్కువగా చూడకుండా భర్త, పిల్లలను మీరే కంట్రోల్ చేయాలి." అని చంద్రబాబు సూచించారు.

## మహిళల భద్రతకు, వారి ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం



**మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళల భద్రతకు, వారి ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఒంగోలు నగరంలోని బృందావనం కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎంపీ శ్రీ.మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే శ్రీ. దామచర్ల జనార్ధన్ రావు, మేయర్ శ్రీమతి గంగాడ సుజాతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో నడిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలు సంక్షేమ పథకాలను కూడా ఈ దిశగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన మహిళలకు అత్యంత సురక్షితమైన నగరముగా విశాఖపట్నం నిలిచిందన్నారు. 14 ఏళ్లు పైబడిన బాలికలకు హెచ్. పి.వి. వ్యాక్సిన్ వేయించాలని మహిళలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ఆలంబనగా చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. రాజకీయంగానూ ముందడుగు వేసేలా చట్టసభల్లో 33% రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా ముఖ్యమంత్రి శ్రీ.నారా చంద్రబాబు నాయుడు పలు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సాధికారత కోసం వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధి, సమాజ అభవృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళల ఆరోగ్యానికి భద్రతను ఇస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ కుటుంబంలో, సమాజంలో స్త్రీ పాత్రను, నిర్వహిస్తున్న బాధ్యతలను కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళలు ఈ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు. మంత్రి, ఇతర అతిథుల చేతుల మీదగా వీరు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వివిధ పథకాల కింద మెప్మా మహిళలకు రూ.18.60 కోట్లు, డిఆర్డిఏ మహిళలకు రూ.314.61 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.67.28 కోట్ల విలువైన బ్యాంకు చెక్కులను ఆర్థిక రుణం కోసం అందించారు. ఈ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ స్టాల్ ను కలెక్టర్ ప్రారంభించి అర్హురాలైన బాలికకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేయించారు. మెప్మా, ఐసిడిఎస్, పోలీస్, డిఆర్డిఏ, ఏపీఎంఐపీ, బ్యాంకింగ్, పరిశ్రమలు, ఏపీఎస్ ఆర్టీసీ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఇతర అతిథులు వీక్షించారు. ఆయా శాఖల ద్వారా అందిస్తున్న పథకాల ప్రయోజనాలను అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. రాయితీ ద్వారా మంజూరైన ఒక ట్రాక్టర్, మూడు ఆటోలను ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి, కలెక్టర్, ఎంపీ అందించారు. ఈ వేడుకలలో డీఆర్వో బి.చిన ఓబులేసు, డిఆర్డిఏ పిడి నారాయణ, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్.డీ.సి. కళావతి, ఎల్.డి.ఎం. రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ. అర్జున్ నాయక్, ఐసిడిఎస్ పి.డి. నాగమణి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మి, డీఎస్ఓ పద్మశ్రీ, ఒంగోలు డి.ఎస్.పి. శ్రీనివాసరావు, ఇతర అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కవిత, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## కొరిశపాడు రిజర్వాయం పెండింగ్ పనులను రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు**



**కొరిశపాడు, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు రిజర్వాయర్ వద్ద పెండింగ్లో ఉన్న పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు చెప్పారు. ఆదివారం ఆయన ఈ రిజర్వాయర్ ను పరిశీలించారు. ప్రాజెక్ట్ ఎస్.ఈ. అబూత్ అలీం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి ఈ సందర్భంగా రిజర్వాయరుకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు వివరించారు. స్థానికులతోనూ ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయరుకు తరలించేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎత్తిపోతల, పైప్ లైన్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు రిజర్వాయర్ వద్ద కట్ట నిర్మాణ పనులు కొంతమేరకు పూర్తి కావాల్సి ఉందన్నారు. వీటి గురించి ముఖ్యమంత్రి వద జరిగిన సమావేశంలోనూ ప్రస్తావన వచ్చిందన్నారు. మొదట విడతలో ప్రభుత్వం రూ.35 కోట్లను బడ్జెట్లో కేటాయించిందన్నారు. ఇరిగేషన్ మంత్రి శ్రీ. నిమ్మల రామానాయుడు కూడా ఈ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో నష్టపరిహార, పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులను రెండు మూడు నెలల్లో పూర్తిచేసి, రిజర్వాయర్ కింద ఉన్న సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని ప్రకటించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆర్. రాజ్యలక్ష్మి, తహసిల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## జగన్ మద్య నిషేధం వెనక అసలు కథ ఇదేనా

### ఆంగ్ల పత్రిక కథనాన్ని కోట్ చేసిన లోకేశ్

**అమరావతి, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి , గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన మద్య నిషేధం హామీ గురించి ప్రస్తావిస్తూ.. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ సంచలన పోస్ట్ చేశారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన మంత్రి.. 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా అంటూ వ్యాఖ్యలు చేశారు.'ప్రతి నెలా రూ.100 కోట్లు కిక్‌బ్యాగ్స్, రూ.3,500 కోట్లు మనీ లాండరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెలికి తీసిన రూ.1,048 కోట్ల లావాదేవీల జాడ ఎక్కడ' అని ప్రశ్నించారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన లోకేశ్... '2019 ఎన్నికల్లో జగన్ మీరు ఇచ్చిన మద్య నిషేధం హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా. మీరు మద్య నిషేధం గురించి ప్రసంగిస్తూ ఉండగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మద్యం వేలాది కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేసింది. ఇదే టైంలో మీ అనుచరుల జేబులు వేల కోట్ల రూపాయలతో నిండిపోయాయి. ఏపీ ప్రజలకు మీరు సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండడమే మంచిదని అనుకుంటున్నారా?' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

## నీటిపారుదల లస్కర్లకు శుభవార్త

### రోజువారీ వేతనం 350 నుంచి 550కి పెంపు

### ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతి, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సాగునీటి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీపి కబురు అందించింది. జలవనరుల శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 'లస్కర్ల' దశాబ్దాల కష్టాన్ని గుర్తించి.. వారి రోజువారీ వేతనాన్ని భారీగా పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వీరికి అందుతున్న అరకొర వేతనాల స్థానంలో.. గౌరవప్రదమైన జీతభత్యాలను కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జారీ చేసిన జీవో ప్రకారం.. ఇప్పటివరకు లస్కర్లకు చెల్లిస్తున్న రోజువారీ వేతనం రూ.350 నుంచి రూ.550కి పెరిగింది. అంటే ప్రతి రోజూ రూ.200 అదనంగా లబ్ది చేకూరనుంది. నెలకు సగటున లెక్కగడితే.. ఒక్కో కార్మికుడికి సుమారు రూ.6,000 వరకు అదనపు వేతనం లభిస్తుంది. పెరిగిన జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సానుకూల నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగమే వెన్నెముకగా ఉన్న రాష్ట్రంలో.. సాగునీటి పంపిణీ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడేది లస్కర్లే. వీరు సాగునీటి కాలువలు, తూముల ద్వారా పొలాలకు సక్రమంగా నీటిని విడుదల చేయడం.. షట్టర్ల మూసివేత, ఓపెనింగ్ మరియు గేట్ల నిర్వహణను పర్యవేక్షించడం.. కాలువల గట్టుల పటిష్టతను చూడటం, ప్రమాదకరమైన లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడం.. ఆఖరి ఆయకట్టు రైతు వరకు నీరు అందేలా నిరంతరం పహారా కాయడం వంటి పనులు చేస్తుంటారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ వేతన పెంపు డిమాండ్‌ను పరిష్కరించడం ద్వారా.. క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికుల్లో మనోధైర్యం పెరగనుంది. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగడమే కాకుండా.. సాగునీటి పంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డ్రైవర్ హత్య కేసులో కీలక పరిణామం

### అనంతబాబు భార్యకు నాన్‌బెయిలబుల్ వారంట్

**కాకినాడ, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డ్రైవర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ అనంత బాబు భార్య అనంత లక్ష్మీ దుర్గపై జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఈ ఆదేశాలు జారీ చేశారు. కేసుకు సంబంధించి కోర్టు ముందు హాజరు కాకపోవడంతో అనంత లక్ష్మీ దుర్గపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అనంత లక్ష్మీ దుర్గ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ఆయన భార్య అనంత లక్ష్మీదుర్గ అలియాస్ రోజా పాత్ర ఉందని పోలీసులు పేర్కొంటూ అనుబంధ చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన విషయం విదితమే.. దీంతో ఆమెను ఈ కేసులో ఏ-2గా చేర్చిన పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డ్రైవర్ సుబ్రమణ్యం హత్యలో అనంత లక్ష్మీదుర్గ ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కీలక ఆధారాలను కూడా అనుబంధ చార్జిషీట్‌కు జత చేశారు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఆమె కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఈ డ్రైవర్ హత్య కేసు అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది.


## ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం




**నరసరావుపేట, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** SKY LINE మరియు నేటి మనదేశమ్ తెలుగు దినపత్రికల, రిపోర్టర్ బత్తుల. వెంకటేష్, ఈ రోజున తమ దినపత్రికను రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ ఆర్. కనకదుర్గ పద్మజకి స్థానిక సత్తెనపల్లి రోడ్ లో గల వారి కార్యాలయం వద్ద అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బత్తుల వెంకటేష్ మాట్లాడుతూ మార్చ్ 8 మహిళా దినోత్సవ సందర్భంగా వారికి సామాజిక సేవలో భాగంగా రోడ్డు ప్రమాదాలు వాటి నివారణ కొరకు కొన్ని సంవత్సరాల నుండి ప్రజల్లో స్వచ్ఛందంగా అవగాహన కల్పిస్తున్నందుకు శుభ కాంక్షలు తెలియజేశారు.

## పల్నాడు విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ సమావేశం

**నరసరావుపేట, మార్చి 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వర్కింగ్ కమిటీ సమావేశం ఈరోజు విజ్ఞాన కేంద్రం లో శ్రీ గద్దె చలమయ్య అధ్యక్షతన జరిగింది. కమిటీ కన్వీనర్ శ్రీ షేక్ మస్తాన్వలి కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో చేపట్టిన బాలోత్సవాలు, ఉపాధ్యాయ ఉత్సవాలు, సిలబస్లో మార్పులపై దేవరాజ్ మహారాజ్ గారి సెమినార్, విజ్ఞాన కేంద్ర కార్యకర్తలకు నిర్వహించిన స్టడీ సర్కిల్స్ తదితర




కార్యకలాపాలను సమీక్షించాము. ఈనెల 18వ తాదీ ఉచిత మెడికల్ క్యాంపు పల్నాడు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించాలని, శరీర అవయవ దాన అవగాహన సదస్సు సత్తెనపల్లిలో ఈనెల 15వ తేదీ జరపాలని, మను ధర్మ శాస్త్రం పై స్టడీ సర్కిల్ జరపాలని నిర్ణయించడం జరిగింది. సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, కామినేని రామారావు, కట్ట కోటేశ్వరరావు, కొండలు, దరువురి సుబ్బారావు, లక్ష్మీశ్వర రెడ్డి, అంజిరెడ్డి మాస్టారు, భాగేశ్వరి, శివ పార్వతి, ఆర్టీసీ మస్తాన్ గారు, ఈఊరి వెంకట రెడ్డి గారు, కోయ రామారావు గారు, కేత రామ బ్రహ్మంగారు తదితరులు పాల్గొన్నారు.


VASTU HOUSING FINANCE

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

యూనిట్ నెం. 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబయి - 400015, మహారాష్ట్ర.

సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**ఆస్తి స్వాధీన నోటీసు**

ఈ క్రింద సంతకం చేసిన నేను వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి గా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ప్రకారం, అలాగే సెక్షన్ 13(12) తో పాటు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 క్రింద నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించి, ఆయా నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని, ఆ నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. రుణగ్రహీతలు పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, పై చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సంబంధిత నియమావళిలోని రూల్ 8 ప్రకారం నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద వివరించిన ఆస్తిని, క్రింద పేర్కొన్న తేదీన స్వాధీనం చేసుకోవడమైనది. కావున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు, అలాగే సాధారణ, పజలు ఎవరూ కూడా ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపరాదని హెచ్చరించబడుచున్నది. ఈ ఆస్తికి సంబంధించిన ఏవైనా లావాదేవీలు, కింద పేర్కొన్న మొత్తం, దానిపై వడ్డీ, ఖర్చులు తదితరాలతో కలిసి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ శాఖకు ఉన్న బాధ్యతకు లోబడి ఉంటాయని తెలియజేయడమైనది.

| క్రమ సంఖ్య | రుణగ్రహీత పేరు, సహ రుణగ్రహీత పేరు రుణ ఖాతా సంఖ్య | డిమాండ్ నోటీసు తేదీ & ఋణ మొత్తం | ఆస్తి వివరణ | స్వాధీనం తీసుకున్న తేదీ మరియు విధానము |
|---|---|---|---|---|
| 1 | వీర దుర్గ గణేష్ కర్రం (ఋణగ్రహీత), కృష్ణార్జున రావు కర్రం (సహ-ఋణగ్రహీత), జయలక్ష్మి కర్రం (సహ-ఋణగ్రహీత), సత్యనారాయణ కర్రం (సహ-ఋణగ్రహీత) LP0000000056114 | 29/అక్టోబర్/2025 రూ. 41,69,163/- 29/అక్టోబర్/2025 నాటికి | తూర్పు గోదావరి జిల్లా, జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్ పరిధి, గండేపల్లి మండలం, నీలాద్రిరావు పేట గ్రామ పంచాయతీ, జెడ్. రాగంపేట శివారు, నీలాద్రిరావు పేటలోని ఆస్తి వివరాలు: ఆర్.ఎస్. నం. 162/3 - ఎకరాలు 0-96 సెంట్లు - దీనిని ఉప విభజన చేసి ఆర్.ఎస్. నం.162/3A - ఎకరాలు 0-74 సెంట్లు - తూర్పు వైపు ఎకరాలు 0-60 సెంట్ల భూమిని పెద్దాపురం ఆర్‌డిఓ రిఫరెన్స్. B/12/2019 ప్రకారం మార్పు చేయబడింది.ఆర్.ఎస్. నం.162/3A1 - ఎకరాలు 0-60 సెంట్లు - 2904 చ.గజాలు - దక్షిణం వైపు 1002-33 చ.గజాలు, పడమర వైపు 347-11 చ.గజాలు 290-21 చ.మీటర్ల ఖాళీ గృహ స్థలం, డోర్ నెం. 2-142 సమీపంలో, ఆంధ్రప్రదేశ్ -533435.హద్దులుఉత్తరం - కర్రం సత్యనారాయణ మిగిలిన స్థలం 71'-0" దక్షిణం - NH 16 రోడ్డు మార్జిన్ 71'-0" తూర్పు - కర్రం వీర దుర్గ గణేష్ స్థలం 44'-0" పడమర - కర్రం సత్యనారాయణ మిగిలిన స్థలం 44'-0" | లాంఛన ప్రాయి స్వాధీనం తీసుకున్న తేదీ: 02 / 03 / 2026 |
| 2 | అప్పన్న వంటకుల (ఋణగ్రహీత), నాగార్జున వంటకుల (సహ-ఋణగ్రహీత), ప్రవల్లిక వంటకుల (సహ-ఋణగ్రహీత), సుభాషిణి వంటకుల (సహ-ఋణగ్రహీత) LP0000000051925 | 17/నవంబర్/2025 రూ. 12,99,055/- 12/నవంబర్/2025 నాటికి | అచల ఆస్తి: డోర్ నెం. 9-70 కలిగిన ఆర్‌సీసీ భవనం, స్థల విస్తీర్ణం 163.1 చ.గజాలు, ఆర్.ఎస్. నెం. 244/1 లో ఉండి, ఉప విభజన తర్వాత ఆర్.ఎస్. నెం. 244/6 గా నమోదైంది. డోర్ నెం. 9-65 సమీపంలో ఉన్న ఈ ఆస్తి గణపవరం గ్రామం, గణపవరం మేజర్ గ్రామ పంచాయతీ, గణపవరం మండలం, గణపవరం సబ్ రిజిస్ట్రార్ పరిధి, పశ్చిమ గోదావరి జిల్లా లో ఉంది.ఈ ఆస్తి పశ్చిమ గోదావరి రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో గణపవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉండి, ఆర్‌సీసీ భవనంతో కూడిన భూమిపై ఉంది. ఐటమ్ నెం. I: 146.9 చ.గజాల ఖాళీ స్థలం. ఐటమ్ నెం. I, II మరియు III యొక్క మొత్తం విస్తీర్ణం: 163.1 చ.గజాలు. ఆంధ్రప్రదేశ్ - 534198. హద్దులు ఉత్తరం - యజమాని రెండవ కుమారుడు శ్రీనివాస్ స్థలం - 41'-0" దక్షిణం - ఐటమ్ నెం. III త్రిభుజాకార స్థలం - 46' తూర్పు - ఐటమ్ నెం. II త్రిభుజాకార స్థలం - 30'-4" పడమర - పెరుమల్ల వెంకటరత్నం కుటుంబం మరియు కిలపర్తి వీరన్న కుటుంబానికి చెందిన సంయుక్త మార్గం - 29'-4" | లాంఛన ప్రాయి స్వాధీనం తీసుకున్న తేదీ: 06 / 03 / 2026 |

తేదీ : 08.03.2026
స్థలం : తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# మహిళలకు వందనాలు!

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మి, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగవస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సోవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్ధరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరివించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు. 1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది.లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

## జాతీయ ఎస్సీకమిషన్ చైర్మన్‌కు అస్వస్తత

### అధకారులతో సమీక్ష చేస్తుండగా వాంతులు

**రాజమండ్రి,మార్చి8(ఆర్ఎన్ఎ):** రాజమండ్రి పర్యటనలో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వానా శనివారం అస్వస్తతకు గురయ్యారు. ఆయన రాజమండ్రిలో విస్తృత్తంగా పర్యటించారు. ఈ పర్యటనలో కిషోర్ మాక్వానా.. స్వల్ప అస్వస్థతకు గురికావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే కిషోర్ మాక్వానా అస్వస్థతకు గురయ్యారు.

ఈ సమావేశంలో ఉండగానే ఆయనకు వాంతులు కావడంతో వెంటనే అధికారులు స్పందించి సమీపంలోని డెల్టా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ మాక్వానా చికిత్స పొందుతున్నారు.

# ట్రంప్ తదితరుల హత్యకు ప్లాన్

### ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్... పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు

**న్యూయార్క్,మార్చి8(ఆర్ఎన్ఎ):** డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసిన కేసులో పాకిస్థానీ వ్యక్తిని అమెరికా న్యాయశాఖ శుక్రవారం దోషిగా తేల్చింది. ఇరాన్ ఆదేశాల ప్రకారం అతను అమెరికా రాజకీయ వేత్తలను హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. నిందిత వ్యక్తిని ఆసిఫ్ మెర్చంట్‌గా గుర్తించారు. 2020లో ఇరాన్ మిలిటరీ నేత ఖాసిమ్ సొలేమని హత్యకు ట్రంప్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో పాటు కొందరు అమెరికా నేతలను హత్య చేయాలని ఆసిఫ్ మెర్చంట్ ప్లాన్ చేశారు. దీని కోసం అమెరికాలో కొందర్ని రిక్రూట్ చేసేందుకు అతను ప్లాన్ చేశాడు. ఆసిఫ్ టార్గెట్‌లో ట్రంప్‌తో పాటు జో బైడెన్, నిక్కీ హేలీ కూడా ఉన్నారు. ఇరాన్ అధికారుల ఆదేశాల ప్రకారం అమెరికా నేతల హత్య కోసం ఆసిఫ్ రిక్రూట్మెంట్‌కు పాల్పడ్డాడని, దీన్ని ఉగ్రవాద చర్యగా భావిస్తున్నామని అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది. న్యూయార్క్ సిటీ కోర్టు ఈ కేసుపై గత వారం వాదనలు జరుగుతున్నాయి. అయితే ఇరాన్‌లోని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో కలిసి హత్యలకు ప్లాన్ చేసినట్లు ఆసిఫ్ మర్చెంట్ అంగీకరించాడు. అయితే టెహ్రాన్‌లో ఉన్న తన ఫ్యామిలీని కాపాడుకోవాలన్న భయంతో ఆ పనిచేసినట్లు చెప్పాడు. ఇరాన్ టాప్ కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీకారంగా.. అమెరికా



అధ్యక్షుడు ట్రంప్ తో సహా ఇతర రాజకీయ నేతల హత్యకు కుట్రలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పాకిస్థాన్ వ్యాపారి ఆసిఫ్ మర్చంట్ ను యూఎస్‌లోని బ్రూక్లిన్ న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. ఇరాన్‌తో సంబంధాలున్న అతడికి ఈ కుట్ర కేసులో జీవిత ఖైదు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వద్ద ఆసిఫ్ మర్చంట్ శిక్షణ పొందినట్లు రుజువైందని అమెరికా న్యాయస్థానం పేర్కొంది. ప్రముఖ రాజకీయ నాయకుల హత్య కోసం ఐఆర్‌జీసీ తనను 2024లో అమెరికాకు పంపించిందని అతడు విచారణలో అంగీకరించాడు. అయితే, తుది లక్ష్యం ఎవరనేది తనకు వెల్లడించలేదని తెలిపాడు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్ , 2024 అధ్యక్ష రేసులో ఉన్న నిక్కీ హేలితో సహా పలువురు కీలక రాజకీయ నేతలు తమ టార్గెట్‌లో ఉన్నట్లు పేర్కొన్నాడు. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ గతంలోనే ఖండించింది. ఈ హత్య కుట్రతో తమకు సంబంధం లేదని తెలిపింది. పాకిస్థాన్‌లోని పలు బ్యాంకుల్లో కొన్నేళ్ల పాటు పనిచేసిన ఆసిఫ్.. ఆ తర్వాత వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. అతడికి పాక్‌లో వివాహం కాగా.. ఇరాన్‌కు చెందిన మహిళనూ పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. 2024 ఏప్రిల్‌లో అమెరికాకు వచ్చిన ఆసిఫ్.. కిరాయి హంతకుల ఏర్పాటు కోసం ఓ వ్యక్తితో తన ప్రణాళిక గురించి చర్చించాడు. అయితే, ఆ వ్యక్తి అండర్‌కవర్‌లో ఉన్న అధికారిగా సమాచారం. అధ్యక్ష ఎన్నికల సమయంలో పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ఒకరోజు ముందు అండర్‌కవర్ అధికారి సమాచారం మేరకు.. ఆసిఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పాక్‌కు పారిపోయేందుకు విమానం ఎక్కడానికి సిద్ధమవుతుండగా అతడిని పట్టుకున్నారు.

# అన్నిరంగాల్లో ఎఐ విప్లవం

### ఎఐని అంది పుచ్చుకోవడంలోనూ ముందంజలో మహిళ



**న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు ప్రపంచాన్ని,పని వాతావరణాన్ని సమూలంగా మారుస్తున్నది. అన్నిరంగాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుత తరుణంలో... భారతదేశం లోని మహిళా ఉద్యోగులు ఏఐని స్వీకరించడంలో పురుషులతో సమానంగానే కాకుండా, వారి కంటే ముందున్నారని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన 'లింక్డ్ఇన్' తాజా పరిశోధనలో వెల్లడైంది. తమ వ్యాపారాలను మరింత విస్తరించడానికి వీరు 'ఏఐ ఆధారిత ఆటోమేషన్', స్మార్ట్ వర్క్‌ఫ్లోలు మరియు డేటా ఆధారిత నిర్ణయాలకు ప్రాధాన్యత ఇస్తూ.. తమ సంస్థల్లో 'డిజిటల్ పరివర్తన'కు నాంది పలుకుతున్నారు. దీనిపై లింక్డ్ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్, ఇండియా సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నిరాజితా బెనర్జీ మాట్లాడుతూ.. 'భారతదేశంలోని మహిళా ఉద్యోగులు ఏఐ సాధనాలను ఉపయోగించడంలో బలమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ.. లేబర్ మార్కెట్ వాస్తవ పరిస్థితులు మాత్రం కాస్త నిరాశజనకంగానే ఉన్నాయి. లింక్డ్ఇన్ డేటా ప్రకారం, భారతదేశంలో మహిళా కార్మికుల భాగస్వామ్యం ఇప్పటికీ 28.1శాతంతో చాలా తక్కువగా ఉంది. ఈ అంతరాన్ని తగ్గించడానికి కేవలం సాంకేతికత ఒక్కటే సరిపోదు. అయితే ఇక్కడ ప్రోత్సాహకరమైన విషయం ఏమిటంటే... ఇప్పటికే విధుల్లో ఉన్న అనేక మంది మహిళలు ఏఐ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. మరింత ఉత్పాదకతను సాధించే సాధనంగా వారు ఏఐని చూస్తున్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలకు అవసరమైన ఏఐ నైపుణ్యాలను వారు వేగంగా అందిపుచ్చుకుంటున్నారు. పనిలో తమ ప్రభావాన్ని మరింత స్పష్టంగా చూపించడానికి, నాయకత్వ పాత్రల్లో ఎదగడానికి మహిళలకు ఏఐ ఒక బలమైన సాధనంగా ఉపయోగపడుతుంది,' అని అన్నారు. లింక్డ్ఇన్ డేటా ప్రకారం, భారతదేశంలోని మహిళా నిపుణుల్లో 90 శాతం మంది... కార్యాలయాల్లో ఏఐ సాధనాలను ఉపయోగించడం పట్ల తాము పూర్తి విశ్వాసంతో ఉన్నామని చెప్పారు. ఇది పురుషుల కంటే ఎక్కువ. అంతేకాకుండా, ఏఐ సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో కూడా మహిళలు మరింత చురుకుగా ఉన్నారు. తమ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకోవడానికి 35 శాతం మంది మహిళలు చురుకుగా ఏఐ నైపుణ్యాలను నేర్చుకుంటుండగా, పురుషుల్లో ఈ సంఖ్య 29 శాతంగా మాత్రమే ఉంది. ఈ సానుకూల ధోరణి కేవలం కార్యాలయాలకే పరిమితం కాలేదు. వ్యాపారవేత్తల విభాగంలో కూడా... తమ కంపెనీల వృద్ధిపై పురుషుల కంటే మహిళా వ్యవస్థాపకులు అత్యంత సానుకూలంగా ఉన్నారు. వేగంగా మారుతున్న పరిస్థితులను ఎదుర్కొంటున్న మహిళా నిపుణులకు, ఏఐని స్వీకరించడం అనేది ఒక కెరీర్ అడ్వాంటేజ్ మాత్రమే కాదు.. వారు కోరుకునే కెరీర్ వైపు పయనించడానికి ఇది ఒక తోడ్పాటుగా గుర్తించాలి.

# ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

■వాడగాలులు వీచే అవకాశం

■అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక

**హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ):** రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతున్నది. ఈ సీజన్‌లోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకావం ఉందని వాతావరణ శృాఖ హెచ్చరించింది. తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీచే అవకాశమున్నదని హెచ్చరించింది.రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీలు పెరగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. తరుచుగా తగిన మోతాదులో నీరు తాగాలని సూచించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రయాణాలను తగ్గించుకోవాలని కోరారు.ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి–కొత్తగూడెం, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలంటూ వాతావరణ కేంద్రం రెడ్అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రత 39 నుంచి 41 డిగ్రీలకు చేరిందని, రాబోయే నాలుగు రోజులు ఇవే గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని పేర్కొంది. హైదరాబాద్ నగరంలో కూడా గతంలో కంటే భిన్నంగా మార్చిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37–38 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్ ప్రాంతాల్లో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో 14 జిల్లాల్లో 38.5 డిగ్రీలపైనే రికార్డు అయ్యింది. మరోవైపు ఎండలు పెరుగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు హెచ్చరించారు.ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగానే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా యని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత ఎండలు పెరుగుతాయి. కానీ ఈసారి తొలి వారంలోనే వేడి తీవ్రత మొదలైంది. శనివారం ఆరు జిల్లాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. జయశంకర్–భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# తిరుమల లడ్డూపై పదేపదే అవాస్తవాలు

### చంద్రబాబు కుట్ర రాజకీయాలు ... జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే విమర్శలు... వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి

**అమరావతి,మార్చి8(ఆర్ఎన్ఎ):** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారని చంద్రబాబు పదేపదే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్ కలిపారని దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బతీయాలని చంద్రబాబు ఎ÷–లాన్. వైఎస్సార్‌సీపీ హయాంలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను తీసుకొచ్చాం. మార్కెట్లో ఫిబ్రవరి 24న కేజీ హెరిటేజ్ నెయ్యి రూ.541 ఉంది. అదే రోజు మార్కెట్‌లో ఇందాపూర్ నెయ్యి రూ.578గా ఉంది. కేజీ అమూల్ నెయ్యిని రూ.525కే ఇస్తున్నారు' అని సజ్జల తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూలో జంతు కొవ్వు కలవలేదని కేంద్ర దర్యాప్తు బృందం ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సుప్రీంకోర్టు తెలిపిందని అన్నారు.

## బీర్‌బాటిల్‌లో చేపపిల్ల

**హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ):** బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు.

# 20వ శతాబ్దంలో మహిళా దినోత్సవానికి బీజం

### మహిళల సమానత్వం కోసం జరిగిన పోరాటం

**న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ):** మార్చి 8 మహిళలకు అంకితమైన రోజు. ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటారు. మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ.. లింగ సమానత్వాన్ని తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలు వేడుకలను జరుపుకుంటారు. మానవజాతి మనుగడకు ప్రాణం పోసే మహిళ.. ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం.. అన్నింటా సగం అంటూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలు సాధిస్తున్నారు.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. స్త్రీ కుటుంబానికి కళ్ళు, ఇంటికి దీపం ఇల్లాలు.. ఒకప్పుడు నాలుగు గోడలకే పరిమితమైన మహిళలు నేడు అన్వేషించని రంగం లేదు. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. తాను ఎంచుకున్న రంగంలో తమదైన ముద్ర వేస్తూ విజయాలు అందుకుంటున్నారు. తాము ఎవరికీ తీసిపోనని నిరూపించుకుంటున్నారు. వివిధ రంగాలలోని మహిళలు సాధించిన విజయాలను గుర్తించడానికి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న




అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20వ శతాబ్దం ప్రారంభంలో ప్రారంభమైంది. ఈ దినోత్సవ వేడుకలు ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల నుంచి ఉద్భవించాయి. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో ఫిబ్రవరి 28వ తేదీ, 1909 జరుపుకున్నారు. 1908లో న్యూయార్క్‌లో జరిగిన వస్త్ర కార్మికుల సమ్మె జ్ఞాపకార్థం సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. న్యూయార్క్‌లో సోషలిస్ట్ మహిళలు, వస్త్ర కార్మికులు తక్కువ పని గంటలు, అధిక వేతనాలు, ఓటు హక్కును డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అలా మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. అవును యూరోపియన్ కార్యకర్తలు మహిళలకు ప్రత్యేక రోజును కేటాయించాలని ప్రచారం ప్రారంభించారు. తమ ఓటు హక్కును డిమాండ్ చేశారు. అంతేకాదు సమాన వేతనం, పని హక్కుల కోసం నాయకత్వం వహించారు. ఈసారి ఈ ర్యాలీలలో పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. తరువాత 1910లో కోపెన్‌హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జెట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిపాదించారు. ఆ ఆలోచన ఆమోదించబడింది.

## ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా తప్పక సందర్శించాల్సిన పవిత్ర స్థలాలు.. ఏమిటో తెలుసా!










**తిరుపతి, ఆంధ్రప్రదేశ్:** కలియుగ వైకుంఠం తిరుమల. ఇక్కడ పురాతనమైన శ్రీ వేంకటేశ్వర దేవాలయం ఉంది. మలయప్ప స్వామి, వెంకన్న, బాలాజీ శ్రీవారు ఇలా అనేక పేర్లతో భక్తులతో పూజలను అందుకుంటున్నాడు వేంకటేశ్వరుడు. ఈ ఆలయం కలియుగ దైవం గా ఖ్యాతిగాంచిన వెంకన్న రూపంలో విష్ణువుకు అంకితం చేయబడింది. తిరుమల కొండలపై ఉన్న ఈ ఆలయం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే తీర్థయాత్ర క్షేత్రాల్లో ఒకటి. రోజూ వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.

**రిషికేశ్, ఉత్తరాఖండ్:** గంగా నది ఒడ్డున హిమాలయాల దిగువ ప్రాంతంలో ఉన్న రిషికేశ్ "ప్రపంచంలోని యోగా రాజధాని"గా ప్రసిద్ధి చెందింది. ఆధ్యాత్మిక అన్వేషకులకు అత్యంత ఇష్టమైన గమ్యస్థానంగా నిలిచింది. పట్టణం ఆశ్రమాలు, దేవాలయాలు, యోగా కేంద్రాలతో నిండి ఉంది. ఇక్కడ సందర్శకులు యోగా , ధ్యానంతో మనసుని, శరీరాన్ని రిచర్జ్ చేసుకోవచ్చు. ప్రకృతి అందాలు కూడా కనుల విందు చేస్తాయి.

**బోధ్ గయా, బీహార్:** 2500 సంవత్సరాల క్రితం బోధి వృక్షం క్రింద బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన ప్రదేశంగా బోధ్ గయకు అపారమైన ప్రాముఖ్యత ఉంది. మహాబోధి ఆలయ సముదాయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం. బోధి వృక్షాన్ని కలిగి ఉన్న గయా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ యాత్రికులను ఆకర్షిస్తుంది. బోధి వృక్షం క్రింద ధ్యానం చేయడం, బోధ్ గయలోని నిర్మలమైన మఠాలను సందర్శించడం మంచి ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి.



**అమృత్‌సర్, పంజాబ్:** అమృతసర్ సిక్కు మతానికి చెందిన ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడ ప్రపంచ ప్రసిద్ధి చెందిన గోల్డెన్ టెంపుల్ (హర్మందిర్ సాహిబ్) పర్యాటకులను ఆకర్షిస్తుంది. పవిత్రమైన అమృత సరోవరం (మకరందపు కొలను)తో పసిడి పూసిన ఆలయం మానసిక ప్రశాంతతను ఇస్తుంది. అన్ని మతాల ప్రజలు ఇక్కడ ఉచిత సామూహిక భోజనం (లంగర్)లో పాల్గొంటారు. ఇది సమానత్వం, సేవను తెలిపే సిక్కు మత సూత్రాలను అనుభవించడానికి స్వాగతించింది.

**వారణాసి (కాశీ), ఉత్తరప్రదేశ్:** పవిత్రమైన గంగా నది ఒడ్డున ఉన్న వారణాసి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన నగరం. హిందూ మతంలో అత్యంత పవిత్రమైన నగరం. యాత్రికులు, పర్యాటకులు, ఫోటోగ్రాఫర్లు ఇక్కడికి వస్తుంటారు. దశాశ్వమేధ ఘాట్‌లో ప్రతిరోజూ సాయంత్రం జరిగే గంగా ఆరతి వేడుకను చూడడం ఓ అద్భుతమైన ఆనందాన్ని ఇస్తుంది.

## పాలు తాగితే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుందా..!



శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగితే భవిష్యత్‌లో గుండె జబ్బుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదాన్ని ముందుగా గ్రహించి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం మంచిది.

ఇప్పుడు అతిపెద్ద ప్రశ్న ఏంటంటే పాలు తాగితే కొలెస్ట్రాల్ పెరుగుతుందా.. ఇందులో నిజం ఎంతుంది.. ఎందుకంటే కొలెస్ట్రాల్ గురించి చాలా అపోహలు ఉన్నాయి. వాస్తవానికి శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు పాలు తాగడం మానేస్తారు. దీనివల్ల వారి ఆరోగ్యం చాలా దెబ్బతింటుంది. కొలెస్ట్రాల్ అంటే కొవ్వు మాత్రమే కాదు. ఇది కొవ్వు, ప్రొటీన్‌లతో ఉన్నటువంటి ఒక రకమైన లిపిడ్. ఇది రక్తంలో ఆరోగ్యకరమైన కణాలను తయారు చేయడంలో సహాయపడుతుంది. హెచ్‌డిఎల్ అంటే హై డెన్సిటీ లిపోప్రొటీన్ గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతుంది. మరోవైపు ఎల్‌డిఎల్ సిరల్లో ఎక్కువగా పేరుకుపోతే గుండెపోటు వంటి తీవ్రమైన వ్యాధులు వస్తాయి. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో మంచి, చెడు కొలెస్ట్రాల్ రెండు ఉంటాయి. మనం మంచి కొలెస్ట్రాల్ మాత్రమే తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం.

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఒబెసిటీలో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం.. పాలు తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిపై ఎటువంటి ప్రభావం ఉండదు. అంతేకాదు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని వివిధ రకాల పరిశోధనలలో తేలింది. నిత్యం పాలు తాగేవారిలో గుండె జబ్బుల ప్రమాదం14 శాతం తగ్గుతుందని వివిధ పరిశోధనల్లో వెల్లడైంది. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. పాల ఉత్పత్తులను తీసుకోవడం తగ్గించాల్సిన అవసరం లేదని ఈ అధ్యయనంలో స్పష్టమైంది.

### పాల వల్ల లాభాలు

రోజులో పావు లీటరు పాలు తాగితే అందులో 8 గ్రాముల కొవ్వు ఉంటుంది. ఒక్క ఈ కొవ్వు గురించి ఆలోచించి పాలు తాగడం మానేయద్దు. శరీరానికి రోజువారీ అవసరాలకి కావాల్సిన ఇతర పోషకాలు పాలలో పుష్కలంగా లభిస్తాయి. పాలల్లో ఉండే కాల్షియం ఎముకలను బలోపేతం చేస్తుంది. దీనివల్ల వయసు ముదిరాక బోలు ఎముకల వ్యాధి వచ్చే అవకాశం తగ్గుతుంది. పాల ద్వారా విటమిన్ ఎ, విటమిన్ బి12, పొటాషియం, మెగ్నీషియం, జింక్, అయోడిన్ వంటివి లభిస్తాయి.

## విజయవాడలో కాల్పుల ఘటన కలకలం

### పోలీసులపైకి కాల్పులు చేసేందుకు యత్నం... వ్యక్తిని పట్టుకుని తరలించిన పోలీసులు

**విజయవాడ, మార్చి 8 (ఆర్ఎన్ఎ):** విజయవాడలో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసులపైనే కాల్పులు జరిపేందుకు ఓ దుండగుడు ప్రయత్నించాడు. అయితే, ట్రిగ్గర్ బ్లాక్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం, అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ దుండగుడు పోలీసులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో గన్ ట్రిగ్గర్ లాక్ కావడంతో బుల్లెట్ బయటకు రాలేదు. దీంతో, అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. సదరు వ్యక్తిని పట్టుకున్నారు. దుండగుడి వద్ద నుంచి 9 ఎంఎం పిస్టల్, ఐదు రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, కాల్పులు జరిపిన వ్యక్తిని వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతడిని ఈగల్ టీమ్ విచారిస్తున్నట్టు పోలీసులు చెప్పుకొచ్చారు. విజయవాడ బస్టాండ్ సమీపంలోని హోటల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వ్యక్తి పోలీసులపైనే తుపాకీతో కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడం నగరంలో సంచలనంగా మారింది. విజయవాడ పోలీసులు, ఈగల్ అధికారులు బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా తన వద్ద ఉన్న తుపాకీతో అధికారులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో నిందితుడు ట్రిగ్గర్ నొక్కినప్పటికీ, టెక్నికల్ లోపం కారణంగా బుల్లెట్ ఛాంబర్‌లోకి రాకపోవడంతో అధికారులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. కాల్పులు విఫలం కావడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు, ఈగల్ అధికారులు ప్రాణాలకు తెగించి అతడిని వెంటాడి పట్టుకున్నారు. అసలు ఆ వ్యక్తి విజయవాడకు ఎందుకు వచ్చాడు, గన్ ఎలా వచ్చింది., ఎవరినైనా హతమార్చేందుకు అతడు కుట్ర పన్నాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బహిరంగ ప్రదేశంలో, అది కూడా రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం సామాన్య ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసింది.

## ఆందోళనకరంగా ఏపి ఆర్థికస్థితి

### తప్పుడు లెక్కలతోతప్పుదోవ పట్టించే యత్నం... అభివృద్ధికి, ఆదాయ లెక్కలకు పొంతనేదీ

### ఎక్స్ వేదికగా పయ్యావుల కేశవ్‌పై బొత్స ఆగ్రహం

**అమరావతి,మార్చి8(ఆర్ఎన్ఎ):** ఏపీలో ఆందోళనకరమైన ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటోందని, కల్పిత జీఎస్‌డీపీ గణాంకాలతో వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రచారం చేస్తున్నారంటూ కాగ్ లెక్కలను మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ బహిర్గతం చేశారు. తప్పుడు లెక్కలపై బొత్స మండిపడ్డారు. ఈ మేరకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ కౌంటరిచ్చారు. మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి.. కాగ్ రిపోర్టు డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేయలేక పోతున్నానని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ మేరకు విపక్షనేత బొత్స సత్యనారాయణ ఎక్స్ వేదికగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌పై విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ప్రస్తుతం ఒక ఆందోళనకర మైన ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాల్లో అది స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, మీ ప్రభుత్వం కల్పితమైన గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్న తప్పుడు అభిప్రాయాన్ని కల్పిస్తోంది. వృద్ధిలో ఈ సంవత్సరం రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలలో 3వ స్థానంలో ఉందని మీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. అయితే మీ ప్రభుత్వం తరపున మీరు ఇస్తున్న అంకెలు, గణాంకాలు ఏ స్వతంత్ర సంస్థ విడుదల చేసినవి కావు. ఇవన్నీ చంద్రబాబు కార్యాలయం తయారు చేసిన గణాంకాలు, కాకిలెక్కలు. ఈ గణాంకాలు నిజమైతే, అదే స్థాయిలో ప్రభుత్వ ఆదాయాల్లో కూడా వృద్ధి కనిపించాలి. ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి 9 నెలలకు సంబంధించి విడుదలచేసిన గణాంకాలు చూస్తే ఈ విషయం చాలా స్పష్టంగా వెల్లడి అవుతోంది. మీరు చెప్పుకుంటున్నట్టుగా 'విజనరీ నాయకత్వం' కింద తయారుచేసిన కల్పిత గణాంకాల వల్ల మాత్రమే ఇది సాధ్యమైంది. దీంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరపు మొదటి 9 నెలలకు సంబంధించి 23 రాష్ట్రాలకు వచ్చిన ఆదాయాలకు సంబంధించిన ఖాతాలనుకూడా అంఉ అప్‌లోడ్ చేసింది. ఆ రాష్ట్రాలతో పోల్చి చూస్తే పన్ను ఆదాయ వృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలుస్తోంది.

## హింసను కోరిన ప్రేమపెళ్లి




- మహిళల రక్షణ సమాజం బాధ్యత
- వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
- ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
- మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి
- స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ):** మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపు లను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.



## రాఘవపురంలో బావిలో పడి విద్యార్థి మృతి...



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి)** :నందిగామ మండలం రాఘవపురంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పల్లగిరికి చెందిన పాల్వాయి తేజ (14) అనే ఏడో తరగతి విద్యార్థి బావిలో పడి మృతి చెందాడు. సెలవు రోజు కావడంతో తేజ మామిడి తోటకు వెళ్లి నీళ్ల పెడుతుండగా కాలుజారి బావిలో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతసేపటికి బాలుడు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతికారు. బావి వద్ద బాలుడి చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గంటల తరబడి శ్రమించి బావిలో నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తేజ మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామస్తులు కూడా బాలుడి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెలవు రోజున జరిగిన ఈ విషాద ఘటన రాఘవపురం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది.

## మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్...



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ మండలం తోటచర్ల హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మనోహర్ తీవ్రంగా గాయపడ్డారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం అనంతరం మనోహర్ రోడ్డుపక్కన తీవ్ర గాయాలతో పడిపోయారు. అదే సమయంలో వత్సవాయి నుంచి వస్తున్న వీరులపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శివ వెంటనే స్పందించి మానవత్వం చాటుకున్నారు. గాయపడిన మనోహర్‌కు ప్రథమ చికిత్స అందించి వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వ్యక్తిని ముండ్లపాడు గ్రామానికి చెందిన మనోహర్‌గా గుర్తించారు. ఈ విషయం ఆయన కుటుంబ సభ్యులకు పోలీసు సిబ్బంది సమాచారం అందించారు. కానిస్టేబుల్ శివ వెంటనే స్పందించి సహాయం చేయడంతో స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## పెనుగంచిప్రోలులో ఘనంగా పసుపు కుంకుమ ఉత్సవాలు...



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడులోని అమ్మవారి పుట్టిల్లు అయిన కొల్లా వారి ఇంటి నుంచి పసుపు--కుంకుమ బండ్లు శనివారం రాత్రి వైభవంగా బయలుదేరాయి. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలంకరించిన రథంపై పసుపు, కుంకుమ బండ్లను ఉంచి భక్తుల జయజయధ్వానాల మధ్య పెనుగంచిప్రోలు వైపు తరలించారు. ఊరేగింపుగా సాగిన ఈ కార్యక్రమాన్ని చూసేందుకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మార్గమధ్యంలో భక్తులు హారతులు ఇచ్చి అమ్మవారికి ప్రార్థనలు చేశారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఆలయ ఈవో మహేశ్వర్ రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాలతో ఊరేగింపు మార్మోగింది. పసుపు--కుంకుమ బండ్లను పెనుగంచిప్రోలు ఆలయానికి వైభవంగా తరలించారు. కార్యక్రమం భక్తి పారవశ్యంలో సాగి స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది.

## పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్లలో బ్లేడ్ బ్యాచ్ హల్చల్..



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో బ్లేడ్ బ్యాచ్ కలకలం సృష్టించింది. ఉత్సవాలకు భారీగా భక్తులు తరలి వచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు జిల్లాకు చెందిన పొలపాల రాజు తిరునాళ్లకు వచ్చి ఆలయ సమీపంలో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బ్లేడ్‌తో అతని పీక, ముఖంపై గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. రక్తస్రావంతో బాధపడుతున్న రాజును గమనించిన భక్తులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సేవలు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని మెడికల్ క్యాంపుకు తరలించాయి. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పెనుగంచిప్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ తెలిపారు. తిరునాళ్ల నేపథ్యంలో పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు

# వేప చెట్టుకు పాలు కారుతున్న వింత...!

-బ్రహ్మంగారి కాలజ్ఞానం గుర్తుచేస్తున్న ఘటన
- వేప చెట్టుకు పాలు.. చూడటానికి జనం రద్దీ
- వేప చెట్టు నుంచి పాలు.. భక్తులతో కిటకిట



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ నియోజకవర్గంలోని చందలపాడు మండలం బ్రహ్మబొట్లవారి పాలెం గ్రామంలో వింత ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ వేప చెట్టు నుంచి పాలు లాగా తెల్లటి ద్రవం కారుతుండటంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఈ ఘటన జరుగుతుండటంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్తుల వివరాల ప్రకారం, గ్రామానికి సమీపంలోని పొలంలో ఉన్న వేప చెట్టు కొమ్మల నుంచి తెల్లటి ద్రవం కారడం మొదలైంది. మొదట్లో దీనిని సాధారణంగా తీసుకున్నా, శనివారం నుంచి మరింతగా కారడం ప్రారంభమైందని వారు తెలిపారు. చెట్టు కాండం, కొమ్మల నుంచి పాలు లాగా కారుతున్న ద్రవాన్ని చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని చెట్టును పరిశీలిస్తున్నారు. కొందరు దీనిని దేవుని సంకేతంగా భావించి పూజలు కూడా చేస్తున్నారు. మరికొందరు బ్రహ్మంగారి కాలజ్ఞానంలో చెప్పినట్లుగా వేప చెట్టుకు పాలు కారడం ఒక సూచనగా భావిస్తూ చర్చించుకుంటున్నారు. దీంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ వింత విషయం చుట్టుపక్కల గ్రామాలకు కూడా వ్యాపించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో బ్రహ్మబొట్లవారి పాలెం గ్రామానికి తరలివస్తున్నారు. చెట్టును చూడటానికి వచ్చిన వారు పూలు, కొబ్బరికాయలు సమర్పిస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. కొందరు చెట్టు నుంచి కారుతున్న ద్రవాన్ని సేకరించి ఇంటికి తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా, కొందరు రైతులు మాత్రం ఇది చెట్టుకు గాయం కావడం లేదా సహజసిద్ధమైన రసం కారడమే కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే అసలు కారణం ఏమిటన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వింత ఘటన బ్రహ్మబొట్లవారి పాలెం గ్రామంలో ఆసక్తికరంగా మారి, స్థానికంగా చర్చనీయాంశమైంది.

## ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మహిళా దినోత్సవ వేడుకలు...



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. మహిళల సేవలను గుర్తిస్తూ వారికి సత్కారాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు హాజరై మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. కుటుంబంతో పాటు ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అన్నారు. మహిళల ప్రతిభకు సమాజం ఎప్పటికీ గౌరవం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కాలేజీలో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను ప్రత్యేకంగా సత్కరించారు. వారికి పూలదండలు వేసి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ అనుభవాలను పంచుకుంటూ మహిళల సాధికారతపై మాట్లాడారు. మహిళలు ఐక్యంగా ముందుకు సాగితే సమాజంలో మరింత మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా కాలేజీ కార్యాలయ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను ప్రశంసించారు. ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ ఆఫీస్ సిబ్బంది, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. మహిళల సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు కాలేజీ ఆవరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## నాదెండ్లలో శనగల కొను గోలు కేంద్రం ప్రారంభం





**నాదెండ్ల మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండల కేంద్రం నాదెండ్లలో రైతులకు మరో సౌకర్యం ఆదివారం అందుబాటులో వచ్చింది. స్థానిక పాత సొసైటీ భవనంలో మార్కుఫెడ్ - నాబార్డు శాఖల ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు ఆదివారం ఉదయం ప్రారంభించారు. నాదెండ్ల, గణపవరం, సాతులూరు, ఇర్లపాడు గ్రామాలలో శనగ పండించే రైతులకు ఈ కేంద్రం ఉపయుక్తంగా ఉంటుందని హరిబాబు పేర్కొన్నారు. సదరు నాలుగు గ్రామాలకు చెందిన రైతులు తమ శనగ పంటను ఈ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చని ఆయన వివరించారు. ప్రస్తుతం శనగ పంటకు ప్రభుత్వం రూ. 5875/- లను మద్దతు ధరగా అందిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రంలో తమ పంటను విక్రయించదలచిన రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, తేమ శాతం 14 శాతం ఉండేలా జాగ్రతలు వహించాలని తెలిపారు. శనగలలో ఇతర పంట గింజలు, వ్యర్థ పదార్థాలు లేకుండా చూడాలన్నారు. పురుగు పట్టి తాలుగా మారిన గింజలను వేరు చేయాలని కోరారు. పంట సస్యరక్షణ, నిల్వ చేయుటలో అధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు తైవాన్ స్ప్రేయర్లను హరిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, నాదెండ్ల గ్రామ సర్పంచి మొగిలి నాగలక్ష్మి, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు లక్ష్మి రెడ్డి, ఆంజనేయులు, రైతు విభాగం అధ్యక్షులు యనమదల సూర్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు ఆరె రామారావు, సీనియర్ నాయకులు వేములపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి పూర్ణయ్య, చాగంటి అమరయ్య, మొగిలి సాంబయ్య, చేకూరి నారాయణ స్వామి, నల్లమోతు వెంకట నారాయణ, వేములపల్లి శరత్, కక్కెర అనిల్, గ్రామ వ్యవసాయ సహాయకులు శివారెడ్డి, నాయక్, రైతులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం వైస్ మెన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'



**మచిలీపట్నం మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక మచిలీపట్నం క్లబ్, వైస్ మెన్ ఇంటర్నేషనల్ అజ్మీర్ బాబా సేవ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సయ్యద్ బాజి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల ప్రాముఖ్యతను సమాజంలో వారి పాత్రను కొనియాడారు. సేవా కార్యక్రమంలో భాగంగా తొలుత సయ్యద్ పీర్, క్లబ్ సభ్యులు, సమాజ సభ్యులు కలిసి ఇందిరా గాంధీ, సరోజినీ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'అన్నపూర్ణ వృద్ధాశ్రమం'లో ఉన్న వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ.. మహిళ లేనిదే సమాజం లేదని, సమానత్వం, సాధికారత విముక్తి కోసం పోరాడిన మహిళామూర్తులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. సుమారు 1400 ఏళ్ల క్రితమే మహ్మద్ ప్రవక్త తన సందేశంలో మహిళలపై వివక్ష చూపరాదని, తల్లి పాదాల చెంత స్వర్గం ఉందని బోధించారని గుర్తుచేశారు. మహిళా చైతన్యం మన ఇళ్ల నుండే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజ సభ్యులు, డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, నితిన్, అల్లాఉద్దీన్, ఇస్మాయిల్, షేర్ అలీ, కేదారి మరియు ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "అందరూ మహిళలను గౌరవించాలి" అనే నినాదంతో కార్యక్రమం ముగిసింది.

### జనసేన వీర మహిళల ఆధ్వర్యంలో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం



**బాపట్ల మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ నరాలశెట్టివారి పాలెం లో ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు, ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి, నామన అశ్విని, ఉస మాధవి, ఆకిశెట్టి నాగమల్లేశ్వరి, మనలి చైతన్య, జన సైనికులు పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసేందుకు ఈ చొరవ తీసుకున్నారు.

## నందిగామలో మండుతున్న ఎండలు...



**నందిగామ మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో మార్చి నెలలోనే ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఇప్పటికే కనిపిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగిపోతుండగా మధ్యాహ్నం సమయానికి పరిస్థితి మరింత కఠినంగా మారుతోంది. నందిగామ ప్రాంతంలో ఆదివారం గరిష్టంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా రహదారులపై రద్దీ తగ్గిపోయి మధ్యాహ్నం సమయంలో చాలా చోట్ల నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండాలని హెచ్చరించారు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడంతో పాటు తాగునీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో తిరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు తెలిపారు.

### మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి సిడిపిఓ



**రేపల్లె మార్చి 08 ( నేటి మన దేశమ్ ప్రతినిధి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సిడిపిఓ సుచిత్ర మాట్లాడుతూ, మహిళలు సాధికారత సాధించి, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి ప్రభుత్వాలు సమాన హక్కులు కల్పించాలని అన్నారు. మహిళల పాత్రపై డిఎల్పిఓ పద్మావతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాదరావు కూడా పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి సివిల్ జడ్జి ఐ. స్వాతి




**చిలకలూరిపేట మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ. స్వాతి పిలుపునిచ్చారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ఉన్న అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మహిళలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో జడ్జి స్వాతి మాట్లాడుతూ, గతంలో మహిళల పట్ల సమాజంలో వివక్ష ఉండేదని గుర్తు చేశారు. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టిందని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడే దుస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆమె పేర్కొన్నారు. నేటి సమాజంలో ఆడపిల్లలు తమ ప్రతిభతో అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో పురుషుల కంటే మహిళలే అన్ని రంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని జడ్జి స్వాతి ధీమా వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి దోహదపడే గొప్ప కార్యక్రమాల్లో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తారని ఆమె సూచించారు. మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు.

## జిల్లా సమగ్ర నివేదికను తయారు చేయాలి....

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్న దృష్ట్యా అందుకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేసి అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ల కాన్ఫరెన్స్కు అవసరమైన నివేదికలపై జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్కు అవసరమైన వివరాలతో కూడిన నివేదికను సత్వరమే తయారుచేసి సిపిఓ కు అందజేయాలన్నారు. ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి కీలక పనితీరు సూచికలు (కే పి ఐ )ప్రకారం లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ఏమైనా లోటుపాట్లు ఉంటే అందుకు గల కారణాలు వివరిస్తూ నివేదికలు అందజేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు క్షేత్రస్థాయిలో అందిస్తున్న పలు రకాల సేవలపై ప్రజల సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) ఎలాగుంది, అందులో పేలవమైన పనితీరు కనపరిచే ప్రదేశాలు, అందుకు గల కారణాలు, పనితీరు మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన చర్యలపై నివేదిక అందజేయాలన్నారు. గత కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రస్తావించిన అంశాలపై వివరాలను అందజేయాలన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన సంక్షిప్త వివరాలను కూడా అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల నుండి నివేదికలు అందిన తర్వాత జిల్లాకు సంబంధించిన సమగ్ర నివేదికను తయారు చేయాలని కలెక్టర్ సిపిఓ కు సూచించారు. ఈ వర్చువల్ కాన్ఫరెన్స్లో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ చంద్రశేఖర రావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు

## డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేత



**ఉండి మార్చి 08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉండి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రక రామకృష్ణంరాజు పాల్గొని, వివిధ రంగాలకు చెందిన 20 మంది మహిళలను సన్మానించారు. అనంతరం, నియోజకవర్గంలోని 1,199 స్వయం సహాయక సంఘాలకు చెందిన 11,990 మంది మహిళలకు బ్యాంకు ద్వారా మంజూరైన రూ. 1,25,62,00,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

# మూలిగే బాక్సాఫీస్ మీద క్రికెట్ మ్యాచ్ దెబ్బ



అసలే బాక్సాఫీస్ యమా నీరసంగా ఉంది. శ్రీవిష్ణు 'మృత్యుంజయ్'కు డీసెంట్ టాక్ ఉన్నప్పటికీ బిసి సెంటర్లలో ఆశించిన స్థాయిలో పికప్, వసూళ్లు లేవు. ఉన్నంతలో నగరాలు, పట్టణాల్లో కొంచెం మెరుగ్గా ఉంది. శివాజీ 'సాంప్రదాయినీ సుప్పిని సుద్దపూస' ఫస్ట్ షోకే ఫలితం తేలిపోగా 'మెన్షన్ హౌస్ మల్లేష్'కు సోషల్ మీడియా హడావిడి తప్ప గ్రౌండ్ లెవెల్ లో చెప్పుకునేంత సౌండ్ లేదు. వరలక్ష్మి శరత్ కుమార్ డైరెక్ట్ చేసిన ఎస్ సరస్వతికి కాసిన్ని ప్రశంసలు వినిపించాయి కానీ అవి వసూళ్లుగా మారుతున్న వైనం కనిపించడం లేదు. గత వారం వచ్చిన విష్ణు విన్యాసం వీక్ డేస్ లోనే పూర్తిగా నెమ్మదించేసింది. సరే ఈ రోజు ఆదివారం వీకెండ్ అన్ని సినిమాలకు ఏమైనా కాస్త తెరిపి దక్కి కలెక్షన్లు వస్తాయనుకుంటే క్రికెట్ రూపంలో దెబ్బ పడింది. ఐసిసి మెన్స్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఇండియా న్యూజిలాండ్ మధ్య జరగనుంది. సాయంత్రం అయిదు నుంచే హడావిడి ఉంటుంది. జనాలు బాగా ఎగ్జైట్ మెంట్ తో ఉన్నారు. చాలా చోట్ల మల్టీప్లెక్సుల్లో లైవ్ మ్యాచ్ ని ప్రదర్శించబోతున్నారు. రెగ్యులర్ టికెట్ ధరలే పెట్టడంతో టికెట్లు వేగంగా అమ్ముడుపోతున్నాయి. గత ఇరవై నాలుగు గంటల్లో 30 వేల టికెట్లు బుక్ మై షోలో అమ్మడం కొత్త రికార్డు. అంటే వర్కౌట్ కాని సినిమాలను భరించడం కన్నా ఇష్టమైన క్రికెట్ ని బిగ్ స్క్రీన్ మీద ఎంజాయ్ చేయొచ్చని ఆడియన్స్ భావిస్తున్నారు. ఆ కారణంగానే విజయవాడ లాంటి చోట్ల నాలుగైదు క్రికెట్ షోలు వేసినా వేగంగా ఫుల్స్ పడుతున్నాయి. ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాకపోవడంతో ఎగ్జిబిటర్ల కళ్లన్నీ మార్చి 19 మీద ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్, దురంధర్ ది రివెంజ్ రెండు ఒకే రోజు రానుండటంతో మళ్ళీ థియేటర్లు ప్రేక్షకులతో హౌస్ ఫుల్ బోర్డులతో నిండుగా కళకళలాడతాయని ఎదురు చూస్తున్నారు. ముందు రోజు సాయంత్రం నుంచే ప్రీమియర్లు ఉంటాయి కాబట్టి హడావిడి అప్పటి నుంచే మొదలవుతుంది. అందాక ఈ నిర్లిప్తతను తట్టుకోక తప్పదు. సంక్రాంతికి ఒకేసారి స్టార్ల సినిమాలన్నీ వచ్చేయడం, తర్వాత విశ్వక్ సేన్ లాంటి నోటబుల్ హీరోలున్న చిత్రాలు ఫ్లాప్ కావడం ఈ పరిస్థితి కారణమని చెప్పొచ్చు. ఉన్నంతలో కపుల్ ఫ్రెండ్లీ లాంటివి కొంత బండిని లాగాయి కానీ లేదంటే ఇంకా తీవ్రంగా ఉండేది.




## ప్రీమియర్ల ప్లానింగులో ఉస్తాద్ సతమతం



మార్చి 18 రాత్రి ప్రీమియర్ షోల అప్డేట్ కోసం పవన్ కళ్యాణ్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. డబ్బింగ్ కార్యక్రమాలు, పోస్ట్ ప్రొడక్షన్, రీ రికార్డింగ్ తదితర పనుల్లో బిజీగా ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ బృందం టైం చాలా తక్కువగా ఉండటంతో ప్రమోషన్లపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టలేకపోతోంది. సరే కంటెంట్ బాగుంటే పవన్ మూవీకి ఇవన్నీ అక్కర్లేదు కానీ ఇప్పుడు అందరి నుంచి ఎదురవుతున్న ప్రశ్న ఒక్కటే. ప్రీమియర్లను ఎలా ప్లాన్ చేస్తారనేది. ఆంధ్రప్రదేశ్ లో టికెట్ రేట్ల హైక్ సులభంగా వచ్చేస్తుంది. అదేమీ సమస్య కాదు. కాకపోతే ధర ఎంత పెడతారనేది అసలు చిక్కు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 600 రూపాయలు పెట్టినా ఇబ్బందయ్యేలా ఉంది. అఖండ తాండవం 2కి కొన్ని ఏరియాల్లో ఇదే సమస్యగా మారింది. ఓజి హైప్, బడ్జెట్ వేరు కాబట్టి దానికి వెయ్యి రూపాయలు పెట్టినా అభిమానులు లెక్క చేయలేదు. కానీ ఉస్తాద్ భగత్ సింగ్ అంత భీభత్సమైన బజ్ లేదు. మెల్లగా బిల్డ్ చేస్తున్నారు. కాకపోతే సమయం ఎక్కువగా లేదు. అసలే దురంధర్ ది రివెంజ్ షోలను సాయంత్రం అయిదు గంటల నుంచే స్టార్ట్ చేస్తున్నారు. పాజిటివ్ టాక్ వస్తే ఆ ప్రభావం రాత్రి నుంచే మొదలవుతుంది. దానికి ధీటుగా ఉస్తాద్ టాక్ రావాలి. వింటేజ్ పవన్ కళ్యాణ్ ని దర్శకుడు హరీష్ శంకర్ ఎలా చూపించాడనేది చాలా కీలకం కానుంది. ఇక తెలంగాణ విషయానికి వస్తే తొంభై రోజుల ముందు అనుమతి తీసుకుంటే బెనిఫిట్ షోలు, హైక్స్ కి పర్మిషన్ ఇవ్వమని కోర్టు ఇంతకు ముందే చెప్పింది. టెక్నికల్ గా ఇది పాటించడం ఉస్తాద్ భగత్ సింగ్ వల్ల కాదు. దాని బదులు అనుమతి అవసరం లేని గరిష్ట ధర 295 రూపాయలు (మల్టీప్లెక్సులు) పెట్టేస్తే మంచి ఫలితం ఉంటుందని ట్రేడ్ భావిస్తోంది. ఒకవేళ ఏపీలో జిఓ తీసుకున్నా ఒక వీకెండ్ కే పరిమితం చేయాలని, పదేసి రోజులు పెట్టడం వల్ల వసూళ్లు రావడం లేదని బయ్యర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట. వీలైనంత త్వరగా మైత్రి మూవీ మేకర్స్ క్లారిటీ ఇస్తే బెటర్. ఉగాది, రంజాన్ పండక్కు వస్తున్న స్టార్ హీరో స్ట్రెయిట్ మూవీ ఇదొక్కటే కావడంతో మరీ ఎక్కువ ఆశించకుండా డీసెంట్ ప్రైజింగ్ తో వెళ్తే ఎలా ఉంటుందనే కోణంలో అనాలసిస్ చేసుకోవాలి. ఒకపక్క దురంధర్ రివెంజ్ ప్రీమియర్ షోలు అంతకంత పెరుగుతూ పోతున్నాయి. ఉస్తాద్ కూడా ఇంకో రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తే అభిమానులు రిలాక్స్ అవుతారు. అప్పటిదాకా టెన్షనే.

## అణిగిమణిగి లేకుంటే సినిమాల్లో తీసేస్తారు



బిగ్ బాస్ షో ద్వారా మంచి పాపులారిటీ సంపాదించిన అమ్మాయి.. ఆషు రెడ్డి. ఐతే ఆ ఫేమ్ ఆమెకు పెద్దగా అవకాశాలు తెచ్చిపెట్టలేక పోయింది. ఆషు రెడ్డి నటించిన సినిమాలు తక్కువే. అందులో కూడా చిన్నా చితకా పాత్రలే చేసింది. ఐతే ఇప్పుడు ఆమెకు విక్రమ్ ఆన్ డ్యూటీ అనే సినిమాలో హీరోయిన్ తరహా పాత్ర దక్కిందట. దీని గురించి ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్లో చాలా ఎగ్జైట్ అవుతూ మాట్లాడింది ఆషు. తన సొంత తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే వీళ్లు తనకు జీవితాన్ని ఇచ్చారంటూ ఆ చిత్ర నిర్మాతలను కొనియాడింది ఆషు. ఐతే ఆ తర్వాత ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రొడక్షన్ హౌస్ చాలా స్ట్రిక్ట్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సెట్లో, అయినా ఇంట్లో అయినా అణిగి మణిగి ఉండాలని.. లేదంటే సినిమాల నుంచి తీసేస్తారని ఆమె వ్యాఖ్యానించింది. ఆర్టిస్టులు ఎవరైనా ఓవరాక్షన్ చేస్తే తీసేయడానికి వెనుకాడరని ఆమె కామెంట్ చేసింది. ఇంతలో మరో నటి అందుకుని అలాంటిదేమీ లేదని నవ్వుతూ వ్యాఖ్యానించింది. ఇక ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన కీరవాణి భలే సరదాగా మాట్లాడారు. ఏమైనా హుక్ లైన్స్ చెప్పమని అడిగితే.. పాటలకు హుక్ లైన్స్ ఉంటాయి కానీ, ఈవెంట్లకు ఉండవని ఆయనన్నారు. కానీ తనకు నచ్చని ఒక విషయం చెబుతా అంటూ బయట తనకు కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టడం.. బొకే ఇవ్వడం లాంటివి తనకు ఇష్టం ఉండవని ఆయనన్నారు. వీటి కోసం డబ్బులు వృథా చేయడం బదులు.. ఆ ఖర్చుతో ఇంట్లో ఉప్మా పెసరట్టు చేసుకుని వస్తే ఒక పట్టు పడతానని.. అవి ఒంటికి కూడా బాగా వంటపడతాయని కీరవాణి అనడంతో అక్కడ నవ్వులు పూశాయి. బిగ్ బాస్ ఫేమ్ నిఖిల్ హీరోగా నటించిన విక్రమ్ ఆన్ డ్యూటీ త్వరలో హాట్ స్టార్‌లో స్ట్రీమ్ కానుంది.

## మొన్న వార్-2.. నేడు కిమ్స్.. ఫ్యాన్స్‌పై తారక్ ఫైర్




స్టార్ హీరోల ఈవెంట్లలో అభిమానులు ఎంత హడావుడి చేస్తారో టాలీవుడ్ సినిమా ఈవెంట్లు చూసే వాళ్లకు కొత్తగా చెప్పాల్సిన పని లేదు. తమ అభిమాన హీరో హీరోయిన్లను చూసినపుడు ఉత్సాహం కట్టలు తెంచుకుని కొంత హడావుడి చేయడం వరకు ఓకే. కానీ సందర్భం చూడకుండా.. అతిథులు మాట్లాడుతున్నపుడు అదే పనిగా నినాదాలు చేయడం.. ప్రసంగాలకు అడ్డుతగలడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇదొక మేనియాలా మారి.. ఎంత ఎక్కువ హంగామా చేస్తే ఆ హీరోకు అంత ఫాలోయింగ్ ఉన్నట్లు.. ఆ ఫ్యాన్స్ అంత గ్రేట్ అన్నట్లుగా అందరు అభిమానులూ ఇలాగే తయారవుతున్న పరిస్థితి. స్టార్ హీరోలు స్వయంగా వారిస్తున్నా సరే.. ఫ్యాన్స్ ఈ విషయంలో తగ్గట్లేదు. జూనియర్ ఎన్టీఆర్ సైతం తరచుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. దీంతో ఫ్యాన్స్ మీద కోపాన్ని దాచుకోకుండా బయటపెట్టేస్తున్నాడు జూనియర్. గత ఏడాది 'వార్-2' సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్లో హృతిక్‌తో పాటు ఇతర అతిథులు మాట్లాడుతున్నపుడు ఫ్యాన్స్ పదే పదే తన పేరును ఉచ్ఛరిస్తూ అడ్డుతగలడంతో తారక్ ఫ్రస్టేట్ అయ్యాడు. అభిమానులకు కొంచెం గట్టిగానే వార్నింగ్ ఇచ్చాడు. తాజాగా బెంగళూరులో కిమ్స్ హాస్పిటల్ ఆరంభోత్సవం సందర్భంగానూ తారక్ ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాడు. డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతున్నపుడు.. అభిమానులు అదే పనిగా తారక్ తారక్ అంటూ నినాదాలు చేయడంతో జూనియర్‌కు కోపం వచ్చింది. దీంతో 'క్వయిట్ క్వయిట్' అంటూ చాలా సీరియస్‌గా అభిమానులకు వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అందరూ సైలెంట్ అయ్యారు. తాను ప్రతిసారీ వారిస్తున్నా అభిమానులు కంట్రోల్ కాకపోవడం తారక్‌కు బాగా కోపం తెప్పిస్తున్నట్లే ఉంది. తాజా అనుభవం తర్వాత అయినా అభిమానులు మారాల్సిన అవసరముంది. మిగతా ఫ్యాన్స్ సైతం ఈ అనవసర హంగామాకు తెరదించాల్సిన అవసరముంది.



# బిజినెస్ న్యూస్



## పడిపోయిన పసిడి ధరలు.. వారమంతా ఆనందమే!




పసిడి ప్రియులకు గడిచిన వారమంతా ఆనందమే కలిగింది. దేశంలో బంగారం ధరలు గత వారం రోజులుగా తగ్గుముఖం పట్టాయి. వరుసగా ధరలు పడిపోవడంతో పసిడి కొనే వారికి భారీ ఊరట లభించింది. గత వారంలో, అంటే మార్చి 2 నుంచి మార్చి 8 వరకు దాదాపు వారమంతా పసిడి ధరలు గణనీయంగా క్షీణించాయి. ఈ కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు కూడా ఒత్తిడికి గురయ్యాయి, దీంతో స్థానికంగా కూడా ధరలు పడిపోయాయి.

ధరలు దిగొచ్చాయిలా..

హైదరాబాద్, విశాఖ పట్నం సహా తెలుగు రాష్ట్రాలలో గత వారం బంగారం ధరలను ఒకసారి పరిశీలిస్తే.. మార్చి 2న 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,70,510 ఉండగా మార్చి 8 నాటికి రూ.1,63,640 లకు దిగొచ్చింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మార్చి 2న రూ. 1,56,300 ఉండగా మార్చి 8 నాటికి రూ.1,50,000 లకు క్షీణించింది.

అంటే వారం మొత్తంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.6,870 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.6,300 తగ్గుదలను నమోదు చేసింది.

ఈ వారంలో ధరలు రోజుకు రోజూ తగ్గుతూ వచ్చాయి. ముఖ్యంగా మార్చి 3, 4 తేదీల్లో భారీ తగ్గుదల నమోదైంది. తర్వాత కొంత ఊపిరి పీల్చుకున్నా మొత్తంగా వారం అంతా క్షీణతే కనిపించింది. మార్చి 8న మాత్రం ధరలు స్థిరంగా ఉన్నాయి.

బంగారం ధరల తగ్గుదలకు ప్రధాన కారణాలు

అంతర్జాతీయంగా బంగారం ధరలు మార్చి ప్రారంభంలో రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి (ఔన్స్‌కు సుమారు 5,400 డాలర్ల పైన). కానీ తర్వాత అమెరికా డాలర్ బలపడటం, ట్రెజరీ యీల్డ్స్ పెరగడం, మిడిల్ ఈస్ట్ ఘర్షణల నేపథ్యంలో ఇన్‌ఫ్లేషన్ భయాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాల మార్పు వల్ల సేఫ్-హెవెన్ డిమాండ్ తగ్గింది. ఇది బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చింది. అలాగే, కొన్ని రోజుల్లో ప్రాఫిట్ బుకింగ్, స్పెక్యులేటివ్ సెల్లింగ్ కూడా జరిగాయి. దీంతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు పడిపోయాయి.

## మహిళలకు ఉచిత లాకర్, ఆరోగ్య బీమా

### యెస్ బ్యాంక్ ప్రత్యేక వేతన ఖాతా

మహిళల కోసం ప్రత్యేక వేతన ఖాతాను తీసుకొచ్చినట్లు ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ఆర్థిక, జీవనశైలి అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి ప్రయోజనాలు, సంపద సృష్టి వంటి ప్రత్యేక సేవలను ఈ ఖాతా ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువస్తుందని బ్యాంక్ వెల్లడించింది. యెస్ ఎసెన్స్ ఉమెన్స్ శాలరీ అకౌంట్‌లో తొలి సంవత్సరం ఉచిత లాకర్ సౌకర్యం, ఏడాది పాటు రూ.5 లక్షల కాంప్లిమెంటరీ హెల్త్ కవర్, ఏడాదికి ఒకసారి ఉచిత ఆరోగ్య పరీక్షలు వంటి ఫీచర్లు ఉన్నాయి. వీటితో పాటు ఖాతాదారులు కాంప్లిమెంటరీ ఎలిగెన్స్ డెబిట్ కార్డు పొందొచ్చు. దీని ద్వారా ఎంపిక చేసిన విభాగాల్లో 5 శాతం క్యాష్‌బ్యాక్ (ఏటా రూ.6,000 వరకు) పొందొచ్చు.

ఎస్‌బీఐ రూ.4,590 కోట్ల రుణాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4,590 కోట్లు) సామాజిక రుణ సౌకర్యాన్ని తీసుకొచ్చింది. లింగ వివక్షను తగ్గించేందుకు, ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యం సాధించేందుకు ఇది దోహదం చేస్తుంది. పర్యావరణం, సామాజిక, పాలన సూత్రాలపై బ్యాంకుకు ఉన్న నిబద్ధతకు, స్థిరమైన అభివృద్ధికి నిదర్శనంగా ఇది నిలుస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జెండర్-థీమ్ రుణంగా పేర్కొంటున్న ఈ పథకం.. ఆర్థిక వృద్ధితో పాటు, సామాజిక మార్పును తీసుకొచ్చేందుకు ఉద్దేశించింది.



పత్యేక గృహ రుణం 'స్ఫూర్తి': మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఎల్ అండ్ టీ ఫైనాన్స్ 'స్ఫూర్తి' పేరుతో ప్రత్యేక గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. గృహ రుణాలపై గరిష్ఠంగా 25 ఏళ్లు, పారిశ్రామిక ఆస్తుల హామీతో 12 ఏళ్ల వరకూ కాల వ్యవధితో రుణాలు ఇస్తున్నట్లు తెలిపింది. వ్యాపారంలో కనీసం 50 శాతం వాటా ఉండి, రూ.5 లక్షల వార్షిక లాభం పొందే మహిళలు దీనికి అర్హులు. తక్కువ వడ్డీ రేట్లు, సడలించిన నిబంధనలతో రూ.75 లక్షల వరకూ రుణాలు పొందవచ్చు.

## పాత వాహనాలపై డబుల్ ట్యాక్స్!




మహారాష్ట్ర ప్రభుత్వం పాత వాహనాలను రద్దు చేసి.. కొత్తవి కొనుగోలు చేసే వాహనదారులకు పన్ను ప్రోత్సాహకాలను ప్రతిపాదించింది. ఈ సమయంలో.. కొన్ని పాత ప్రైవేట్ వాహనాలపై పర్యావరణ పన్నును పెంచాలని కూడా యోచిస్తోంది. 2026--27 రాష్ట్ర బడ్జెట్ సమయంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. రోడ్డుపై పాత లేదా కాలుష్య కారక వాహనాల సంఖ్యను తగ్గించడం ఒ రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యతను మెరుగుపరచడం ఈ చర్యల లక్ష్యం అని అన్నారు. కొత్త ప్రతిపాదన ప్రకారం.. ఇప్పటికే ఉన్న వాహనాన్ని స్క్రాప్ చేసి, కొత్త వాహనాన్ని కొనుగోలు చేసే కొనుగోలుదారులకు మోటారు వాహన పన్నులో రాయితీ లభిస్తుంది. బీఎస్-4 లేదా కొత్త ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వాహనాలను స్క్రాప్ చేసేవారికి 16 శాతం పన్ను రాయితీ లభిస్తుంది. బీఎస్-3 లేదా పాత ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలను స్క్రాప్ చేసి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసేవారికి 30 శాతం అధిక రాయితీ లభిస్తుంది.

బీఎస్-4 ఒ అంతకు ముందు ఉద్గార ప్రమాణాలు కలిగిన నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని ఫడ్నవీస్ అన్నారు. దీనిని పరిష్కరించడానికి.. పన్నును రెట్టింపు చేయాలని ప్రతిపాదించడం జరిగిందని పేర్కొన్నారు.

## సమ్మర్‌లో ఏసీ షాక్.. ధరలు పెంచేస్తున్న కంపెనీలు

ఈ వేసవికి ఏసీ కొనాలనుకుంటున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్. ముడి పదార్థాల ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఏసీ తయారీ కంపెనీలు ధరలు పెంపునకు సిద్ధమవుతున్నాయి. రవాణా ఖర్చులు, కొత్త ఇంధన వినియోగ నిబంధనలు కూడా పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలు పెంచగా.. మరికొన్ని పెంపునకు సిద్ధమవుతున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హైయర్, మిత్సుబిషి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ప్రముఖ ఏసీల తయారీ కంపెనీ డైకిన్ తన ఏసీ ధరలను 12 శాతం వరకు పెంచనుంది. మోడల్‌ను బట్టి ఏప్రిల్ నుంచి ఈ పెంపు ఉండబోతోందని డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా పేర్కొన్నారు. ఏసీల తయారీలో వినియోగించే రాగి వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో పాటు, కొత్త ఇంధన నిబంధనల వల్ల ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల వల్ల సరకు రవాణా ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయం లేక ఏసీ ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి ఏసీ కంపెనీదీ ఇదే పరిస్థితి అని వివరించారు. ఈ ఏడాది ఏసీల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు.



బ్లూస్టార్ ఇది వరకే: మరో ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఫిబ్రవరి మధ్యలోనే ఏసీ ధరలను 8-10 శాతం పెంచేసింది. అయితే పాత ధరల ఇన్వెంటరీ ఇప్పటికీ మార్కెట్లో ఉన్నందువల్ల రేటులో పెద్దగా తేడా ఉండబోదని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. ఏసీల ధరల పెరుగుదల ఊహించి డీలర్లు ముందుగానే స్టాక్ పెట్టుకుని, వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్‌పై మాత్రం ధరల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ సైతం 5-15 శాతం మేర ఏసీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. గడిచిన కొన్ని నెలలుగా రాగి ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం అవ్వడం వంటి కారణాలతో రేట్లు పెంచాల్సి వస్తోందని వోల్టాస్ ఎండీ ముకందన్ మేనన్ పేర్కొన్నారు. దీంతో పాటు ఎల్‌జీ సంస్థ 3 స్టార్ ఏసీలపై 7 శాతం, 5 స్టార్ మోడళ్లపై 9-10 శాతం చొప్పున ధరల పెంచుతున్నట్లు వెల్లడించింది. హైయర్ ఇండియా సైతం 5-8 శాతం మధ్య ధరలు పెంచబోతోందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ సతీష్ పేర్కొన్నారు. మిత్సుబిషి ఏసీ ధరలు 5 శాతం మేర పెరగనున్నాయని ఆ కంపెనీ పేర్కొంది.

2026పైనే ఆశలు: ఏసీ తయారీ కంపెనీలన్నీ దాదాపు ఈ ఏడాది విక్రయాలపై పెద్దగానే ఆశలు పెట్టుకున్నాయి. గతేడాది వీటి విక్రయాలు మందగించడమే ఇందుకు కారణం. అకాల వర్షాలు, ఇతర అంశాలు వీటి విక్రయాలపై ప్రభావం చూపాయి. 2024లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, ఉక్కపోత కారణంగా రికార్డు స్థాయిలో ఏసీల విక్రయాలు నమోదయ్యాయి. మళ్లీ ఆ స్థాయిలో విక్రయాలను ఈ ఏడాది ఉంటాయని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

## జీవీఎంసీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- స్త్రీ శక్తి విలువ పెరిగింది
- జీవీఎంసీ ప్రాంగణంలో మహిళా పార్కు ఏర్పాటు చేస్తాం
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్ట్రీయల్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ , జెమ్స్ మహిళా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ మహిళ అధికారులు, ఉద్యోగులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్ట్రీయల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, స్త్రీ శక్తి చాలా గొప్పదని, అన్ని రంగాలలో పురుషుల తో సమానంగా



మహిళలు పనిచేస్తున్నారని, శ్రమించడంలో ఆడపిల్లలే ప్రథమ స్థానంలో ఉన్నారని, జీవీఎంసీ పరిధిలో ఎంతోమంది మహిళలు ఉన్నత స్థానంలో పనిచేస్తూ జీవీఎంసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, గతంలో పనిచేసిన మహిళ కమిషనర్ సృజన నిర్ణయాలు చాలా గొప్పగా ఉండేవని కొని యాడారు. మహిళల కొరకు జీవీఎంసీ ప్రాంగ ణంలో ప్రత్యేకంగా మహిళా పార్కును ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. అనంతరం అన్ని రంగాలలో పురుషులతో సమానంగా కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాన్ని నడపడంలో ఒక్క మహిళలకే సాధ్యమని స్త్రీ శక్తి చాలా గొప్పదని బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత పేర్కొన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ అభివృద్ధికి మహిళల పాత్ర అధికంగా ఉందని మహిళలతోనే అభివృద్ధి సాధ్యమని, మీ బాధ్యతలు పై దృష్టి సారించి మీ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మీరు విధులు నిర్వ హించాలని, మహిళలో చిన్నప్పటి నుంచే మనో ధైర్యాన్ని నింపాలని, మహిళలు ఇటు ఉద్యోగంతో పాటు ఇంటిని చక్కదిద్దే పనిని కూడా చేస్తారని,

వారి సేవలు వెలకట్టలేమని జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి పేర్కొన్నారు. భారతదేశంలో మహిళలకు ఒక గౌరవ స్థానం ఉందని, ప్రపంచంలోనే మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అయినప్పటికీ కొంత వివక్షత భారతదేశంలో 1920వ సంవత్సరం నుండి మహిళలకు ఓటు హక్కు కల్పించడం జరిగిందని, మహిళల యొక్క హక్కులను కాపాడవలసిన బాధ్యత మనపై ఉందని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి తెలిపారు. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ సకల దేవతలు ఉంటారని, మహిళలను అందరూ గౌరవించాలని, సృష్టికి మూలం స్త్రీ అని, పూలే వంటే సంఘ సంస్కర్తలు మహిళలు ఉన్నతకి ఎంతో కృషి చేశారని, నేడు ఉద్యోగం, కుటుంబ సమస్యలను ఎదుర్కొంటూ అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని అదనపు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. అనంతరం ఆయన రచించిన జగతికి ఆధారం మహిళ, అమ్మే ఆధారం పాటలను వినిపించారు. అనంతరం వేదిక నలంకరించిన జాయింట్ డైరెక్టర్ (అమృత్) విజయభారతి తదితరులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని వారి సందేశాన్ని అందించారు. జీవీఎంసీ మహిళా అధికారులు, ఉద్యోగులు జీవీఎంసీ ప్రాగణంలో మహిళా పార్కు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందున మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జెమ్స్ సమకూర్చిన నిధుల నుండి మహిళలకు ఆటల పోటీలను, లక్కీ డిప్ లను ఏర్పాటు చేయగా, లక్కిడిపు లో మొదటి స్థానం లో పర్యవేక్షకులు హెన్నా, ద్వితీయ స్థానం లో లావణ్య, తృతీయ స్థానం లో సత్యకుమారి నిలవగా వారికి గిఫ్ట్ కూపన్లు, అలాగే మ్యూజికల్ చైర్, హౌసీ పోటీలలో గెలుపొందిన వారికి గిఫ్ట్ కూపన్ లను మేయర్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ఫోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ ఏ రాజు, జేమ్స్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ, పర్యవేక్షకులు హెన్నా, సన్యాసి రావు, అధిక సంఖ్యలో జీవీఎంసీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

- స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి
- కోర్టు కేసుల పరిష్కారానికి జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ - విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు






**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహా విశాఖ నగరపాలక సంస్థ పై నమోద వుతున్న కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు నిత్య కృషి చేయాలని, జీవీఎంసీ పై ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పార్టీల ఫ్లోర్ లీడర్లు గంగారాం, గంకల కవిత, బీసెట్టి వసంత లక్ష్మి, జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు , జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ, జోనల్ కమిషనర్లు, అధికారులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ పై అధిక సంఖ్యలో కోర్టు కేసు దాఖలు అవుతున్నాయని వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించకపోవడం వలన పైకోర్టులను ఆశ్రయించవలసి వస్తుందని, తద్వారా జీవీఎంసీ కమిషనర్ కు ,అధికారులకు విధులకు ఆటంకం కలుగుతూ సమయం వృధా అవుతుందని అన్నారు. కొన్ని సందర్భాల్లో కమిషనర్ ఎక్కువగా కోర్టుకు స్వయంగా హాజరు కావాల్సి వస్తుందని, నూతనంగా నియమితమైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ పై నమోదవుతున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి జీవీఎంసీ అధికారులతో జోనల్ కమిషనర్లతో సంబంధిత కోర్టుల కేసులకు నిర్ణీత సమయంలో కౌంటర్లను దాఖలు చేసి, కేసులను పరిష్కరించి జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు నిత్యం కృషి చేయాలని కమిషనర్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులకు సూచించారు. కౌన్సిల్ తీర్మానం మేరకు ఈ విషయమై ఫ్లోర్ లీడర్లతో, జీవీఎంసీ అధికారులతో కౌన్సిల్ సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జీవీఎంసీ ఖాళీ స్థలాలు, పార్కులు, ఆక్రమణకు గురవుతున్నాయని, షాపులు కళ్యాణ మండపాలు సామాజిక భవనాలు తదితర జీవీఎంసీ ఆస్తులకు సంబంధించిన అద్దెలు ,లీజులపై కోర్టు కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వాటిని పరిరక్షించి, కేసులు పరిష్కరించే బాధ్యత స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పై ఉందని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ రెవెన్యూ పబ్లిక్ హెల్త్ తదితర విభాగాలకు సంబంధించి ఆస్తులు, ఖాళీ స్థలాలు, పార్కులు, సామాజిక భవనాలు ఆక్రమణకు గురవుతూ, భవన నిర్మాణాలపై అధికంగా కోర్టు కేసులకు గురవుతున్నాయని, అలాగే జీవీఎంసీ షాపులు, కళ్యాణ మండపాలు, మార్కెట్లకు సంబంధించి అద్దెలు, లీజులపై కోర్టు కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు నూతనంగా నియమితమైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ కేసులను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు.

అందుకే ప్రత్యేకించి ఈ సమావేశం అందరితో కలిసి నిర్వహించడం జరిగిందన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం ఉన్న కోర్టు కేసులపై క్షుణ్ణంగా విచారణ జరిపి అధికారులకు ,ఉద్యోగులకు సమావేశం నిర్వహించి ఎంఎస్సీలకు నిర్ణీత సమయంలో కోర్టు కేసులకు సంబంధించి సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మకు కమిషనర్ ఆదేశించారు. జీవీఎంసీ కేసులు త్వరగా పరిష్కరించేందుకు గాను పైకోర్టులు హైకోర్టుల వరకు కేసులు కొనసాగించకుండా ఉండేందుకు జీవీఎంసీ స్థాయిలో ఇండిపెండెంట్గా జ్యుడీషియల్ వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

అనంతరం హాజరైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఒక్కొక్కరితో మాట్లాడుతూ వారికి ఇప్పటివరకు అందించిన కేసుల పై కార్యాచరణను అడిగి తెలుసుకుని , ప్రతి కేసుకు సంబంధించి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో కౌంటర్లను దాఖలు చేయాలని అందుకు సంబంధిత అధికారుల వద్ద వెంటనే సమాచారాన్ని పొంది కేసులు పరిష్కార మార్గానికి నిత్యం కృషి చేయాలని కమిషనర్ వారికి సూచించారు. అనంతరం సిపిఎం పార్టీ ఫ్లోర్ లీడర్ బొడ్డు గంగారం మాట్లాడుతూ జీవీఎంసీలో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి దీర్ఘకాల సమస్యకు కౌన్సిల్ తీర్మానం వరకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో,అధికారులతో కోర్టు కేసులపై చర్చ సమావేశం నిర్వహించడం మంచి నిర్ణయమన్నారు. జీవీఎంసీ షాపులకు సంబంధించి అద్దె రెన్యువల్ కాలం పెంచాలని, పార్కులపై ఉన్న కేసులపై దృష్టి సారించాలని, పలు కేసులు జీవీఎంసీ గెలిచినప్పటికీ ఆక్రమణదారులు వాటి ఆక్రమణలకు మరలా దౌర్జన్యం చేస్తున్నారని వాటిపై దృష్టి సారించాలని, మత్స్యదర్శిని, సుబ్బలక్ష్మి నగర్ కల్యాణ మండపం ఆస్తులను కాపాడాలని పేర్కొన్నారు. అనంతరం జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ బీసెట్టి వసంతలక్ష్మి, బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తులను పరిరక్షించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా కళ్యాణ మండపాలు, సామాజిక భవనాలు, పార్కులు, షాపుల ఆస్తుల పై ఉన్న కోర్టు కేసులను పరిష్కరించి జీవీఎంసీ ఆస్తులను కాపాడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు దొడ్డి చంద్రశేఖర్, పడాల అప్పలరాజు,నాలి శేషు కుమార్, నీలి పైడిరాజు, లగుజ భారతి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, అందరు జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు పిడి-యుసిడి సరోజినీ, కార్యదర్శి బివి రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకి, డిసిపిలు, ఏసీపీలు, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



**సామర్లకోట, మార్చి 08 (నేటి మనదేశమ్) :** స్థానిక ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో శని వారం విద్యార్థులు నిర్వహించిన వెజ్ మార్ట్ కార్యక్రమం, విద్యార్థుల తల్లులు నిర్వహించిన టేస్ట్ ది టాలెంట్ కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. ఈ ప్రదర్శనను పాఠశాల కరస్పాం డెంట్ ఎస్వివిసి.ప్రకాష్, డైరెక్టర్ సుధారాణి దంపతులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు వీధి తిను బండారాలకు అలవాటు పడి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటు న్నారని అన్నారు. తినే పదార్థాలను తల్లులు తయారుచేసి వారికి ఇస్తే ఆరోగ్య సమస్యలు ఉండమన్నారు. ఇదే లక్ష్యంతో తాము ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు వెజ్ మార్కెట్ ప్రదర్శన ఆకట్టు కోగా, తల్లులు చేసిన వంటల ప్రదర్శనలో తల్లులు తమ వంటల రుచులను అందరికీ రుచి చూపిం చారు. ఈ సందర్భంగా తల్లులకు నిర్వహించిన పోటీల్లో శాఖాహార విభాగంలో జి.వీణ, మాంసాహార విభాగంలో ఎస్కె.కరీమా సుల్తానా, స్వీట్ విభాగంలో ఎన్.సాయిసత్య రాజేశ్వరి, చాట్ విభాగంలో రత్నకుమారి విజేతలుగా నిలిచారు .

## జాబ్ మేళాలో 932 మందికి ఉద్యోగాలు



**పిఠాపురం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** స్థానిక సూర్య డిగ్రీ కళాశాలలో నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నిర్వహణ సంఘం అధ్యక్షుడు హబీబ్ భాషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 932 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు 1793 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలు అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎంపి తంగేళ్ల ఉదరు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి నియామక పత్రాలను అందజేశారు. జనసేన నాయకులు మెహమ్మద్ హబీబ్ బాషా, కళాశాల కరెస్పాండెంట్ ఎండి చాంద్ భాషా, డైరెక్టర్ మహమూద్ బాషా, వాసవి క్లబ్ జోనల్ ఛైర్మన్ కెవిఆర్.మూర్తి పాల్గొన్నారు.

## రోడ్లు, కాలువల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్





**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** విశాఖ నగరంలో జరుగుతున్న రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గాజువాక జోన్ లో గంగవరం రోడ్లో, జగ్గనాయుడు జంక్షన్ లో రోడ్లు కాలువల అభివృద్ధి పనులను పర్యవేక్షక ఇంజనీర్ రాయల్ బాబుతో కలిసి పరిశీలించారు

కమిషనర్ ముందుగా గంగవరం రోడ్డులో రెండు కోట్ల రూపాయలతో మంజూరు చేసి అభివృద్ధి పరుస్తున్న రోడ్డు పనులను పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకుని పనుల ఆలస్యంపై ఆరా తీశారు. అనంతరం జగ్గు జంక్షన్లో రెండు మురుగునీటి కాలువ లను పరిశీలించిన అనంతరం జరుగుచున్న రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీరు రాయల్ బాబుకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయకు ఇంజనీర్లు, వార్డ్ ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**కాకినాడ మార్చి 08 (నేటి మనదేశమ్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒకరోజు ముందుగానే జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మార్చి 8న జరగాల్సిన మహిళా దినోత్సవం ఆదివారం రోజు రావడంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లోనూ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ శనవారం జరిగాయి. కాకినాడ స్థానిక ఐడియల్ డిగ్రీ కళా శాలలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళలు విద్యార్థులు-నేటి పరిస్థితి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా అధ్యక్షులు భూలక్ష్మి, లోవరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ గీతాంజలి మాట్లాడుతూ మహిళలు అనేక పోరాటాల ఫలితంగా నేడు మహిళా దినోత్సవ నిర్వహించుకుంటున్నామని, ఇది నేటి మహిళలకు ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి మాట్లాడుతూ నేటికీ మహిళలకు సమాన అవకాశాలు ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ నేడు చదువుల్లో, ఉద్యోగంలో మగవాళ్ళతో సమానంగా విద్యార్థినులు పోటీ పడుతున్నారని అన్నారు. మహిళలు చిన్నారిపై జరిగే దాడులకు ప్రధాన కారణమైన మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి.సత్యం, కళాశాల విద్యార్థులు మోహన్, సత్యశ్రీ, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి అపూర్వ భారత్, డిఆర్ఒ టి.తిప్పేనాయక్, కెఆర్సి ఎస్డిసి జి.రత్నమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎస్.రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. వివిధ శాఖలకు చెందిన మహిళలు పాల్గొని వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం జిల్లా ఛైర్పర్సన్ చల్లా సంధ్యారాణి, జనరల్ సెక్రటరీ పి.శిరీష, విమెన్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే అపోలో హాస్పిటల్స్లో మహిళా దినోత్సవాన్ని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ప్రారంభించారు. అపోలో మహిళా సిబ్బంది అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అడికి గణేష్, డాక్టర్ పిపి.చటర్జీ మాట్లాడారు.

